టాప్ న్యూస్

## పెళ్లిపై త్రిష హింట్



- చెన్నై చంద్రం చేతికి రింగ్
- ప్రేమ ఎల్లప్పుడూ గెలుస్తుందంటూ సిగ్నల్

02

## ఎక్స్‌ను అమ్మేశా..



- ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన
- 33 బిలియన్ల డాలర్లకు విక్రయించినట్లు వెల్లడి

07

## మోదీ తెలివైన వ్యక్తి..



- గ్రేట్ ప్రైమ్ మినిస్టర్
- ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు

02

Follow: @ANNTELUGU
30-03-2025
మహా పత్రిక
ANN తెలుగు
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 118 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## ఈ ఏడాది రాజపూజ్యమెవరికి?

ఉగాది అంటే గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. పంచాంగం. కవితల పోటీలు. ఉగాది పంచాంగం పై తెలుగువారందరికీ ఆసక్తి ఉంటుంది. రాజపూజ్యం, రాజయోగం లెక్కలు వేసుకుని ఆ క్షణాన సంతృప్తి పడడం మామూలే. ఈ ఏడాది పాలకులకు, ప్రజలకు అన్నీ శుభాలేనని విశ్వావసు నామ సంవత్సరం కబురు మోసుకొచ్చింది. మంత్రివర్గ విస్తరణపై రకరకాల చర్చలు జరుగుతున్నా, శ్రీరామనవమి తర్వాతే స్పష్టత వస్తుందన్న అంచనాలున్నాయి. ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి తులరాశికి ఈ ఏడాది తిరుగులేదని, రాజపూజ్యం, రాజయోగం మెండుగా ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. దేశంలోను అత్యంత శక్తివంతమైన నేతల్లో 28వ ర్యాంకులో నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి తెలుగునాట మోస్ట్ పవర్ ఫుల్ గా మారారు.

- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్

ఎడిటోరియల్ పేజీ 4లో

# మరో పదేళ్లు అధికారం మనదే



## ముస్లింలు నా వెంటే ఉన్నారు

### ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీనే

### రూ.10వేల కోట్లతో కొడంగల్ అభివృద్ధి

### కొడంగల్ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి

**కొడంగల్, మహా :** తెలంగాణను పాలించే శక్తిని కొడంగల్ ప్రజలు తనకు ఇచ్చారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కొందరికి వాళ్ల కుర్చీ పోయిందన్న బాధ ఉండొచ్చు..వాళ్లను పట్టించుకోవద్దని అన్నారు. తానేం చేస్తానో... ఏం చేయనో... మీకంటే ఎక్కువగా ఎవరికీ తెలియదని చెప్పారు. శనివారం కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. పలు భివృద్ధి కార్యక్రమాల్లో రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లింలకు ఎక్కువ అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీనే అని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. కొడంగల్‌లో ముస్లింల అభివృద్ధికి.. ఎమ్మెల్యే నిధుల నుంచి 25శాతం మంజూరు చేశామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఒక్క సంతకంతో కొడంగల్‌కు అన్నీ వస్తాయని... మీరు వెళ్లి ఎవరినో అడగాల్సిన పని లేదని అన్నారు. చిట్టీ రాసిస్తే చాలు తాను కొడంగల్‌కు వచ్చి అన్నీ సమస్యలు పరిష్కరిస్తానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**అంబేద్కర్ రాజ్యాంగం వల్లనే సాధ్యం..**

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లోని తన నివాసంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి అధ్యక్షతన జై బాపు.. జై భీం.. జై సంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మిగతా 2లో

# మృతుల సంఖ్య 10 వేలు?


### పెనువిపత్తుపై అమెరికా ఏజెన్సీ ప్రకటన

### మయన్మార్‌లో 1,644 మృతుల గుర్తింపు

### శిథిలాల కిందే ఇంకా వేలమంది

### మయన్మార్, థాయ్‌లాండ్‌కు అండగా భారత్

**మహా:** మయన్మార్, థాయ్‌లాండ్‌ను శుక్రవారం రెండు భారీ భూకంపాలు వణికించాయి. ఈ పెను విపత్తులో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తు కారణంగా మృతుల సంఖ్య 10వేలు దాటే అవకాశం ఉందని అమెరికా ఏజెన్సీ హెచ్చరించింది. ఈ భారీ ప్రకంపనల ధాటికి తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. వందల సంఖ్యలో భారీ భవనాలు పేకమేడల్లా నేలమట్టమయ్యాయి. ప్రార్ధనాలయాలు, సాధువుల మఠాలు కుప్పకూలాయి. శిథిలాల కింద చిక్కుకుని అనేక మంది విలవిల్లాడుతున్నారు. రెండు దేశాల్లోనూ అక్కడి ప్రభుత్వాలు వివిధ ప్రాంతాల్లో ఆత్యయిక పరిస్థితిని ప్రకటించాయి. ప్రాణ నష్టం అత్యధికంగా మయన్మార్‌లోని మాండలే నగరం, దాని పరిసర ప్రాంతాల్లో జరిగింది. భూప్రకంపనల ప్రభావం భారత్‌తో పాటు చైనా, బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లోనూ కనిపించింది. మిగతా 2లో





మయన్మార్ అధికారులతో

## మాట్లాడిన ప్రధాని

మయన్మార్ సైనిక ప్రభుత్వ సీనియర్ జనరల్ మిన్ ఆంగ్ హలైంగ్‌తో భారత ప్రధాని నరేంద్రమోదీ మాట్లాడారు. భూకంప మృతులకు సంతాపం తెలిపారు. 'ఆపరేషన్ బ్రహ్మ' కొనసాగింపులో భాగంగా సహాయక సిబ్బందిని పంపిస్తున్నామని వెల్లడిస్తూ ప్రధాని మోదీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.




జై బాపు జైభీమ్ జై సంవిధాన్ నినాదంతో...

## ప్రతి ఒక్కరం ముందుకు సాగుదాం

### ఆదిలాబాద్ సమావేశంలో జనక్ ప్రసాద్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉంది కంది మౌన శ్రీనివాసరెడ్డి

కంది శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో భారీగా సమావేశం.. నేతల ప్రతిజ్ఞ

**ఆదిలాబాద్ :** కేంద్రంలోని బీజేపీ సర్కార్ మతపరమైన రాజకీయాలతో నియంతృత్వ పోకడలతో దేశాన్ని భ్రష్టు పట్టిస్తోందని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన సలహా బోర్డ్ చైర్మన్, జైబాపు జైభీం జైసంవిధాన్ ఇంచార్జి జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం నిర్వహించిన జై బాపు జైభీం జైసంవిధాన్ జిల్లా సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్యం కోసం ఆవిర్భవించిన పార్టీ అయితే బీజేపీ కేవలం మత పరమైన పార్టీ అన్నారు. మిగతా 2లో

# తెలంగాణకు ఫుల్ పవర్

### విరామం లేకుండా విద్యుత్ సరఫరా

### గ్రీన్ పవర్ లక్ష్యసాధనలో హిమాచల్ ప్రదేశ్‌తో ఎంవోయూ

### పెరిగిన డిమాండ్‌కు తగ్గట్టు విద్యుత్ కోసం ఒప్పందాలు

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**మహా :** రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ ను దృష్టిలో పెట్టుకొని, విద్యుత్ వనరుల విస్తరణకు, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ప్రకారం పర్యావరణ పరిరక్షణకు హిమాచల్ ప్రదేశ్ తో 520 మెగావాట్ల హైడల్ విద్యుత్ ఒప్పందం చేసుకోవడం గొప్ప ముందడుగు అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం హిమాచల్ ప్రదేశ్ రాజధాని సిమ్లాలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుక్కు ఆ రాష్ట్ర అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్ ఒప్పందం కుదుర్చుకున్నారు. మిగతా 2లో



## చల్లటి కబురు చెప్పిన వాతావరణ శాఖ

మూడు రోజుల పాటు వర్షాలు

ఉరుములు లేని వర్షాలు కురుస్తాయని అంచనా

వివరాలు 3లో


## ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

### 17 మంది నక్సల్ హతం

### మృతులలో మావోయిస్టు అగ్రనేత జగదీశ్



**మహా, భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 17 మంది మావోయిస్టులు మృతి చెందారు. మిగతా 2లో



## రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి ఉగాది శుభాకాంక్షలు

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉగాది పండుగ శుభాకాంక్షలు చెప్పారు. ఆదివారం నుంచి శ్రీ విశ్వావసు నామ తెలుగు సంవత్సరం ప్రారంభం కానుండగా, నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని, ధర్మబద్ధమైన కోరికలు నెరవేరాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. కొత్త సంవత్సరంలో కాలం కలిసి రావాలని, సమృద్ధిగా వానలు కురిసి, పాడి పంటలతో రైతుల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరియాలని ముఖ్యమంత్రి అభిలషించారు. ఉగాది పండుగ రోజున రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి ఉచితంగా సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. ఈ ఏడాదిలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మెరుగైన అభివృద్ధి సాధించి, సంక్షేమ పథకాల అమల్లో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు చాటిచెప్పేలా ప్రతి ఒక్కరు ఉగాది పండుగను సంతోషంగా జరుపుకోవాలని సీఎం పిలుపునిచ్చారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | జనరల్ వార్తలు | GENERAL NEWS | ఆదివారం, హైదరాబాద్ | 30-03-2025
ANN తెలుగు

# మరో పదేళ్లు అధికారం మనదే



## ముస్లింలు నా వెంటే ఉన్నారు

(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై షాకింగ్ కామెంట్స్ చేశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించడం.. గాంధీని హత్య చేసిన వారిని ప్రోత్సహించేలా మాట్లాడిన వ్యాఖ్యలను నిరసిస్తూ ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. దేశంలో ఇంత మంది పదవులు అనుభవిస్తున్నామంటే అది అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనే సాధ్యమని ఉద్ఘాటించారు. దళిత గిరిజన ఆదివాసీ వెనకబడిన వారంతా సమానమనే స్ఫూర్తి అంబేద్కర్‌దని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 'మన కళ్ల ముందు కనిపించే దేవుడు బాబా సాహెబ్ అంబేద్కర్. పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహం ఉంటుందని... అలాంటి అంబేద్కర్‌ను అమిత్ షా అవమానించడం దారుణం. అందుకే ఇలాంటి వారిని.. వారి మాటలను ఖండించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీ ఇచ్చిన పిలుపుతో ఈ కార్యక్రమం చేపట్టాం. మీరు ఆశీర్వదించి ఆదరించినందుకే నేను సీఎంగా ఉన్నా. కొడంగల్‌లో ఇంతకు ముందు ఎంత మంది ఎమ్మెల్యేలుగా ఉన్నా.. పెద్ద పదవి ఇవ్వలేదు.. అందుకే అన్ని విధాలుగా కొడంగల్ వెనుకబడి పోయింది. సిద్దిపేట, సిరిసిల్లా, గజ్వేల్‌కు నిధులు తీసుకుని పోవాలని బీఆర్ఎస్ నేతలు కలలు కన్నారు. కొద్ది మంది అమాయకులను రెచ్చగొట్టి వ్యతిరేకత చూపిస్తున్నారు. వారు ఇచ్చిన పరిహారం కన్నా ఎక్కువ పరిహారం.. వారికి ఉద్యోగం వచ్చేలా చేస్తా.. ఒకవేళ స్కిల్ లేకుంటే ట్రైనింగ్ ఇచ్చి..భూములు ఇచ్చిన ప్రతీ ఇంటికీ రెండు ఉద్యోగాలు ఇప్పిస్తా. కొడంగల్‌కు అతి పెద్ద ఉద్యోగం నాకు సీఎం ఉద్యోగం మీరు ఇచ్చారు.. మీకు ఉద్యోగం వచ్చేలా చేసే బాధ్యత నాది' అని సీఎం రేవంత్‌రెడ్డి మాటిచ్చారు.

### కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తా..

'రూ.10 వేల కోట్లతో కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.. ఇంకో రూ.10 వేల కోట్లతో కొడంగల్‌ను మరింత అభివృద్ధి చేస్తా. నా దగ్గరకు వచ్చిన ప్రతీ ఒక్కరికీ సాయం చేశా.. కానీ నేను పైసా కూడా ఎవరినీ అడగలేదు. ఎవరూ ఏ పార్టీలో ఉన్నా కొడంగల్ అభివృద్ధికి కలసి రావాలని విజ్ఞప్తి. ఒకప్పుడు రూ.30 వేలకు ఎకరా భూమి ఉన్న కొడంగల్‌లో అభివృద్ధి పనులు జరిగితే కోట్ల రూపాయలకు ఎకరా భూమి అవుతుంది. అప్పుడు అందరూ కోటీశ్వరులవుతారు. కులగణన చేసిన ఘనత మాదే.. దీని వల్ల దామాషా పద్ధతిలో నిధుల కేటాయింపు జరపొచ్చు. మరో పదేళ్లు అధికారం మనదే.. అది కూడా కొడంగల్‌కే ఉంటుంది. కొంతమంది గుంట నక్కల్లా కాచుకు కూర్చున్నారని.. వారి ఆశలు మాత్రం పూర్తి కావు. ఈ పదేళ్లు మన జీవితంలో చాలా ముఖ్యం.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మన అజాగ్రత్త వల్ల 2018లో వెనుకబడ్డం.. కానీ నా అదృష్టాన్ని ఎవ్వరూ గుంజుకోలేదు.. నా జీవితంలో ఎంపీ, పీసీసీ అధ్యక్షుడు.. తర్వాత సీఎంగా అయ్యా. ఈ సారి జరుగబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రతీ రోజూ కొడంగల్ నుంచి ఓ మండలం వారికి అసెంబ్లీ సమావేశాలు తిలకించే విధంగా చేస్తా.. మా తడాఖా ఏంటో చూపించాలని మిమ్మల్ని అసెంబ్లీకి పిలుస్తా. స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసి కట్టుగా పని చేయాలి. జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి' అని సీఎం రేవంత్ పిలుపునిచ్చారు.

# మృతుల సంఖ్య 10 వేలు?

- పెనువిపత్తుపై అమెరికా ఏజెన్సీ ప్రకటన
- మయన్మార్‌లో 1,644 మృతుల గుర్తింపు
- శిథిలాల కిందే ఇంకా వేలమంది
- మయన్మార్, థాయ్‌లాండ్‌కు అండగా భారత్

(మొదటిపేజీ తరువాయి)
భూకంపం ధాటికి మయన్మార్ తీవ్రంగా దెబ్బతిన్నది. భూకంపం కారణంగా చనిపోయిన మయన్మార్ ప్రజల సంఖ్య శనివారం నాటికి 1,644కు పెరిగింది. 3 ,408 మంది గాయపడ్డారు. 139 మంది ఆచూకీ దొరకలేదు. ఈ విషయాన్ని స్వయంగా మయన్మార్ మిలటరీ కౌన్సిల్ వెల్లడించింది. సాగింగ్, మండాలే, క్యాక్సే, పైన్ ఊ ల్విన్, ష్వెబోతో సహా అనేక పట్టణాల్లోని భవనాలు కుప్పకూలాయి. శుక్రవారం రోజు మయన్మార్ లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించి ఇళ్లు, పెద్ద పెద్ద భవంతులు, హోటళ్లు, ఆలయాలు, వంతెనలు నిమిషాల్లో నేలమట్టమైన సంగతి తెలిసిందే. శిథిలాలు తొలగించే కొద్దీ మృతుల సంఖ్య పెరుగుతూ పోతోంది.

### మయన్మార్, థాయ్‌లాండ్‌కు అండగా ప్రపంచ దేశాలు

ప్రకృతి విపత్తుతో కుదేలైన మయన్మార్, థాయ్‌లాండ్‌ను ఆదుకునేందుకు ప్రపంచ దేశాలు ముందుకొచ్చాయి. ఇప్పటికే భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ' కింద మయన్మార్‌కు పంపించిన 15 టన్నుల సహాయక సామగ్రి యాంగాన్‌కు చెరుకున్నాయి. టెంట్లు, దుప్పట్లు, స్లీపింగ్ బ్యాగులు, జనరేటర్లు ఆహార ప్యాకెట్లను అందించింది. అటు అమెరికా, ఇండోనేషియా, చైనా కూడా అవసరమైన సాయం అందిస్తామని ప్రకటించాయి. ప్రభావిత దేశాలకు సహాయక సామగ్రిని పంపుతున్నామని ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రటరీ ఆంటోనియో- గుటెరస్ వెల్లడించారు.



జై బాపు జైభీమ్ జై సంవిధాన్ నినాదంతో...

# ప్రతి ఒక్కరం ముందుకు సాగుదాం


## ఆదిలాబాద్ సమావేశంలో జనక్ ప్రసాద్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉంది కంది మౌనా శ్రీనివాస్‌రెడ్డి
కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో భారీగా సమావేశం.. నేతల ప్రతిజ్ఞ




(మొదటిపేజీ తరువాయి)
అభివృద్ధిని మరిచి మతాన్ని అడ్డం పెట్టుకుని ఓట్లు అడగడమే నైజంగా దేశాన్ని పాలిస్తున్న పార్టీ అని విమర్శించారు. భారత రత్న బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చే కుట్ర జరుగుతోందని దాన్ని అడ్డుకుని తీరాలన్నారు. బీజేపీ కబంధహస్తాల కింద దేశం నలిగి పోకుండ కాపాడటంకోసం రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాహుల్ గాంధీ చేపట్టిన జై బాపు జై భీం జై సంవిధాన్ నినాదంతో ప్రతిఒక్కరం ముందుకు సాగుదామని అన్నారు. భారతీయ సమగ్రత కోసం ప్రాణాలు అర్పించిన చరిత్ర గాంధీ కుటుంబానిది అన్నారు. సమసమాజ నిర్మాణం కోసం రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు నాలుగువేల కిలోమీటర్ల యాత్ర చేపట్టారని గుర్తు చేసారు. ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని అన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చే విధంగా చేస్తున్న ప్రయత్నాలను తిప్పి కొట్టాలన్నారు. ఎన్నోభాషలు ఎన్నో మతాలు కులాలున్న దేశం మన దేశం అన్నారు. కులమత బేధాల్లేని పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు. అందరం కలసి పార్టీ గొప్పతనాన్ని ప్రజలకు తెలిపి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న వక్తలు జైబాపు జై భీం జై సంవిధాన్ కార్యక్రమ ఆవశ్యకతను వివరంచారు. కార్యక్రమ చివరిలో కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి అతిథులను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ దుర్గం భాస్కర్ ,ఏఐసీసీ సభ్యులు నరేష్ జాదవ్ , ఆత్రం సుగుణ ,బోథ్ అసెంబ్లీ ఇంచార్జి ఆడె గజేందర్, నాయకులు దిగంబర్ రావు పాటిల్, గోక గణేష్ రెడ్డి ,గుడిపల్లి నగేష్, మునిగెల నర్సింగ్, అల్లూరి అశోక్ రెడ్డి, ఫైజుల్లాఖాన్ ,కొండ గంగాధర్ , లోక ప్రవీణ్ రెడ్డి ,పరమేశ్వర్ ,భూపెల్లి శ్రీధర్ ,ఆనంద్ రావు, మాజీ కౌన్సిలర్లు , కాంగ్రెస్ మహిళా విభాగం నాయకురాళ్లు ,యంపీటీసీలు , సర్పంచ్ లు నియోజక వర్గ నాయకులు , కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## పెళ్లిపై త్రిష హింట్

- చెన్నై చంద్రం చేతికి రింగ్
- ప్రేమ ఎల్లప్పుడూ గెలుస్తుందంటూ సిగ్నల్

**మహా:** చెన్నై చంద్రం త్రిష ఇప్పటికి సింగిల్‌గానే ఉంది. ఆమె తోటి హీరోయిన్స్ అందరు పెళ్లి పీటలు ఎక్కుతుండగా, త్రిష మాత్రం ఆ ఊసే ఎత్తడం లేదు. కాకపోతే అప్పుడప్పుడు మాత్రం తాను పెళ్లి చేసుకోబోతున్నట్టుగా హింట్ ఇస్తుంది. సినిమాలు తప్పితే ఇతర విషయాల గురించి పెద్దగా పట్టించుకోని త్రిష గురించి అప్పుడప్పుడు అనేక ప్రచారాలు జరుగుతుంటాయి. త్రిష తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ట్రెడిషినల్ ఫొటో షేర్ చేసింది. అందులో ఆమె ఆకుపచ్చ రంగు చీర ధరించి, శారీ కలర్ కు మ్యాచింగ్ గా మెడలో నెక్లెస్, చేతికి ఉంగరం ధరించి అచ్చం అతిలోక సుందరిలా కనిపించింది.ఇక ఆ ఫొటోకి 'ప్రేమ ఎల్లప్పుడూ గెలుస్తుంది' అని క్రేజీ క్యాప్షన్ ఇచ్చింది. త్రిష పోస్ట్ తో అందరిలో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఆమె నిజంగా పెళ్లి చేసుకుంటుందా, ఆమె తన అభిమానులకి ఏం చెప్పాలని అనుకుంటుంది. త్రిష పెళ్లికి సమయం ఆసన్నమైందా అని అభిమానులు రకరకాలుగా ముచ్చటించుకుంటున్నారు.

## మోదీ తెలివైన వ్యక్తి.. గ్రేట్ ప్రైమ్ మినిస్టర్

### ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రశంసలు

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాకు మంచి స్నేహితుడు. ఆయన చాలా తెలివైన వ్యక్తి. గ్రేట్ ప్రైమ్ మినిస్టర్. మోదీ ఇటీవలే యూఎస్ పర్యటకు వచ్చారు. మా మధ్య మంచి చర్చలు జరిగాయి. అవి ఇరుదేశాలకు ఉపయోగకరమైనవిగా భావిస్తున్నా. కానీ, ఆ దేశంతో నాకు ఉన్న ఏకైక సమస్య ఒకటే. అది సుంకాలు. ప్రపంచంలోనే అత్యధిక టారిఫ్‌లు విధించే దేశాల్లో భారత్ ఒకటి. అయితే, సుంకాలను వారు గణనీయంగా తగ్గిస్తారని నేను నమ్ముతున్నా. ఏప్రిల్ 2న యూఎస్ దిగుమతులపై ఎంత సుంకాలు విధిస్తే.. నేను కూడా వారి నుంచి అంతే వసూలు చేస్తా' అని ట్రంప్ పేర్కొన్నారు.

# తెలంగాణకు ఫుల్ పవర్

(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు భద్రతను పెంచుకునే అంశానికి కట్టుబడి ఉందని తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ రాష్ట్ర భాగస్వామ్యంతో ప్రతిపాదిత ప్రాజెక్టులు సెలి (400 మెగావాట్లు), మేయర్ (120 మెగావాట్లు)స్వచ్ఛమైన, ఆర్థికంగా మేలైన, విశ్వసనీయమైన విద్యుత్తు ను పొందడంలో ఉపకరిస్తాయని అభివర్ణించారు. జల విద్యుత్తు అత్యంత విశ్వసనీయమైన గ్రీన్ పవర్. థర్మల్ పవర్ తో పోల్చినప్పుడు హైడల్ పవర్ ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటుంది, అంతేకాకుండా థర్మల్ పవర్ ఉత్పత్తి ఖర్చు ప్రతి సంవత్సరం పెరుగుతూ ఉండగా హైడల్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు క్రమంగా తగ్గుతూ వస్తుందని వివరించారు.



హిమాచల్ ప్రదేశ్ హిమాలయ పరివాహక నదులతో నిండి ఉన్న రాష్ట్రం కావడంతో సంవత్సరంలో 9 నుంచి 10 నెలల పాటు నిరంతరం హైడల్ పవర్ ఉత్పత్తికి అనువుగా ఉంటుందన్నారు. హిమాచల్ తో పోలిస్తే దక్షిణ భారతదేశ నదులపై హైడల్ విద్యుత్ ఉత్పత్తి కాలం పరిమితంగా ఉంటుందని తెలిపారు. ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ ప్రభుత్వం హిమాచల్ ప్రదేశ్ సహజ వనరులను వినియోగించుకుని తెలంగాణ ప్రజలకు తక్కువ ధరకు, నమ్మకమైన మరియు పర్యావరణ హిత విద్యుత్ ను అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాన్ని ఈ ఒప్పందం ముందుకు తీసుకెళుతుంది అన్నారు. ఈ ప్రాజెక్టులను తెలంగాణ జెన్ కో నామినేషన్ విధానంలో చేపడుతుంది, తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ పవర్ వాటాను పెంచేందుకు నిరంతరం కృషి చేస్తోందని వివరించారు. భారతదేశ విద్యుత్ రంగంలో, అంతర్రాష్ట్ర సహకారానికి హిమాచల్ ఒప్పందం గొప్ప ఉదాహరణగా నిలుస్తుందని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో తోడ్పాటును అందించడమే కాకుండా హిమాచల్ ప్రదేశ్ హైడ్రో ఎలక్ట్రిక్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఈ ఒప్పంద కార్యక్రమంలో రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్ పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకి, జెన్కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానంద, హిమాచల్ ప్రదేశ్ ఎనర్జీ డైరెక్టర్ రాకేష్ ప్రజాపతి, హిమాచల్ ప్రదేశ్ స్పెషల్ సెక్రటరీ ఎనర్జీ అరిందం చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జై బాపు జైభీమ్ జై సంవిధాన్ నినాదంతో...

# ప్రతి ఒక్కరం ముందుకు సాగుదాం

## ఆదిలాబాద్ సమావేశంలో జనక్ ప్రసాద్

రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే బాధ్యత అందరిపైనా ఉంది కంది మౌనా శ్రీనివాస్‌రెడ్డి
కంది శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో భారీగా సమావేశం.. నేతల ప్రతిజ్ఞ

(మొదటిపేజీ తరువాయి)
ఇందులో 11మంది మహిళలు సహా రూ.25లక్షల రివార్డు ఉన్న ఒక వ్యక్తి ఉన్నట్లు అధికారులు తెలిపారు. మరో ఇద్దరు జవాన్లు గాయపడ్డట్లు చెప్పారు. ఘటనాస్థలంలో భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అంతకుముందు, సుక్మాలో జరిగిన ఆపరేషన్‌లో భద్రతా సంస్థలు 16 మంది నక్సలైట్లను మట్టుబెట్టాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఎక్స్ మాధ్యమంలో పోస్ట్ చేశారు. ఆయుధాలు మార్పును తీసుకురాలేవని, కేవలం శాంతి, అభివృద్ధితోనే మార్పు సాధ్యమని హితవు పలికారు. అనంతరం మరో నక్సలైట్ కూడా మృతిచెందినట్లు అధికారులు అప్డేట్ ఇచ్చారు. కాగా మృతులలో మావోయిస్టు అగ్ర నేత జగదీశ్ ఉన్నారు. ఎన్ కౌంటర్ మృతులలో స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు జగదీశ్ ఉన్నట్లు ఛత్తీస్ గడ్ ఉప ముఖ్యమంత్రి విజయ వర్మ వెల్లడించారు. జగదీశ్ తలపై రు. 25 లక్షల రివార్డ్ ఉంది. ఇతను 2013 లో 30 మంది కాంగ్రెస్ నాయకులను హత్య చేసిన కేసులో, 2023 లో పేలుడు ద్వారా 10 మంది జవాన్లను చంపిన కేసులో ప్రధాన సూత్రదారి. ఘటనాస్థలం నుంచి మృతదేహాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భారీ మొత్తంలో ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. ఘటనాస్థలంలో




ఏకే47 రైఫిల్, సెల్ఫ్‌లోడింగ్ రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, పాయింట్ 303 రైఫిల్, రాకెట్ లాంచర్, బారెల్ గ్రెనేడ్ లాంచర్, పేలుడు పదార్థాలతో పాటు భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు

## విచారణకు హాజరైన శ్రవణ్ రావు.. ఆరు గంటలు ప్రశ్నించిన దర్యాప్తు అధికారులు

## దుబాయ్ నుంచి రాగానే విచారణకు హాజరైన శ్రవణ్ రావు





**మహా :** రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. కేసులో ఆరో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావు శనివారం సిట్ ముందు హాజరయ్యారు. తెల్లవారుజామున దుబాయ్ నుంచి హైదరాబాద్ చేరుకున్న శ్రవణ్ రావు విచారణ కోసం జూబ్లీహిల్స్ ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. విచారణకు హాజరు కావాలని మార్చి 26న శ్రవణ్ రావు కుటుంబసభ్యులకు పోలీసులు నోటీసులు అందజేశారు. మూడు రోజుల తర్వాత విచారణకు హాజరు కావాలని నోటీసులో తెలిపారు. మరోవైపు పోలీసుల విచారణకు సహకరించాలని శ్రవణ్‌రావును సుప్రీంకోర్టు ఇటీవల ఆదేశించిన సంగతి తెలిసిందే. ఆయన్ను అరెస్టు చేయొద్దని ఈ మేరకు సుప్రీం ధర్మాసనం తెలిపింది. ఈ క్రమంలో శ్రవణ్‌ను పూర్తిస్థాయిలో విచారణ చేస్తే కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల సమయంలో ఎవరెవరిపై నిఘా ఉంచారనే విషయంలో పోలీసులు ప్రధానంగా ఆరా తీశారు. శ్రవణ్ రావు సూచన మేరకే నిందితులు ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు నడుచుకున్నారనేది సిట్ ప్రధాన అభియోగం. శ్రవణ్ రావు తాను చేసిన సర్వే ఆధారంగానే పలువురిపై నిఘా ఉంచాలని ప్రభాకర్ రావు, ప్రణీత్ రావులకు సూచించారని ప్రాథమిక ఆధారాలను బట్టి దర్యాప్తు అధికారులు నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి లబ్ది చేకూర్చేందుకు కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు వారికి ఆర్థిక వనరులు సమకూర్చుతున్న వ్యాపారులపై నిఘా ఉంచాలని శ్రవణ్ రావు సూచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రవణ్‌రావును విచారించడం ద్వారా ఈ విషయాలపై స్పష్టత రానున్నట్లు భావిస్తున్నారు.

### ఆరు గంటలు ప్రశ్నించిన అధికారులు

శ్రవణ్ రావును పోలీసులు దాదాపు ఆర గంటలుగా విచారించారు. ఫోన్ ట్యాపింగ్ పరికరాలను ఎక్కడ కొనుగోలు చేశారు? సర్వర్ కేంద్రాలను ఎవరు చెబితే ఏర్పాటు చేశారు? అనే విషయాలపై గత ప్రభుత్వంలో శ్రవణ్‌రావుకు ఉన్న పరిచయాలపై జూబ్లీహిల్స్ పోలీసులు ప్రశ్నించినట్లుగా తెలిసింది. శ్రవణ్ రావు అజ్ఞాతంలో ఉన్నప్పుడు ఎవరెవరితో టచ్‌లో ఉన్నారు? అనే విషయాలపై కూడా పోలీసులు ఆరా తీసినట్లుగా సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసు తెరపైకి వచ్చిన తర్వాత పరారైన శ్రవణ్ రావు విదేశాల్లో ఏయే ప్రాంతాల్లో తలదాచుకున్నారు అనే విషయాలపై ప్రశ్నించినట్లుగా తెలిసింది. ఎవరెవరితో శ్రవణ్‌రావు సంప్రదింపులు జరిపారు అనే దానిపై కాల్ డేటా ఆధారంగా పోలీసులు ఆరా తీసినట్లుగా సమాచారం. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక సూత్రదారి ఎవరు అనే కోణంలో పోలీసులు ప్రశ్నించినట్లుగా తెలిసింది.


2024 మార్చి 10న పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన వెంటనే శ్రవణ్ రావు లండన్‌కు వెళ్లారు. వెంటనే అక్కడి నుంచి అమెరికాకు వెళ్లిపోయారు. సిట్ విచారణకు రాకుండా గత కొన్ని నెలలుగా అక్కడే ఉండిపోయారు. ఇటీవలే ఆయనపై అమెరికాలో రెడ్‌కార్నర్ నోటీస్ సైతం జారీ అయింది. తనకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ తెలంగాణ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ శ్రవణ్ రావు ఇటివలే సుప్రీంకోర్టులో ఎస్ఎల్‌పీ దాఖలు చేశారు. దానిపై ఈనెల 24న జరిగిన విచారణలో శ్రవణ్ రావును అరెస్ట్ చేయకుండా ఆయనకు మధ్యంతర ఉపశమనం లభించింది. కానీ ధర్మాసనం పోలీసుల దర్యాప్తునకు సహకరించాలనే షరతు విధించింది. అందుకు పిటిషనర్ న్యాయవాది అంగీకరిస్తూ అవసరమైతే ఆయన 48 గంటల్లోగా భారత్‌కు తిరిగి వస్తారని సుప్రీం కోర్టుకు హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే 72 (3 రోజులు) గంటల గడువు విధిస్తూ శనివారం తమ వద్ద విచారణకు రావాలని సిట్ స్పష్టం చేసింది. దీంతో ధర్మాసనానికి ఇచ్చిన హామీ ప్రకారం శ్రవణ్‌రావు ఈ రోజు విచారణకు హాజరయ్యారు.

### ప్రధాన అభియోగం ఇదే

స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ కేంద్రంగా ఎవరెవరిపై నిఘా ఉంచాలనే విషయంలో శ్రవణ్ రావు సూచన మేరకే కీలక నిందితులు ప్రభాకర్ రావు, ప్రణీత్ రావు నడుచుకున్నారనేది తెలంగాణ దర్యాప్తు సంస్థ ప్రధాన అభియోగం. శ్రవణ్ రావు తాను చేసిన సర్వే ఆధారంగానే పలువురిపై నిఘా ఉంచాలని కీలక నిందితులకు సూచించారని ప్రాథమిక ఆధారాలను బట్టి దర్యాప్తు అధికారులు నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. 2023 శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు లబ్ది చేకూర్చేందుకే కాంగ్రెస్ అభ్యర్థులతోపాటు వారికి ఆర్థిక వనరులు సమకూర్చుతున్న వ్యాపారులపై నిఘా ఉంచాలని శ్రవణ్ రావు సూచించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శ్రవణ్ రావును విచారించడం ద్వారా ఈ విషయాలపై స్పష్టత రానున్నట్లు భావించారు. మీడియాలో పనిచేస్తూ బీఆర్ఎస్‌కు లబ్ధి చేకూర్చాల్సిన అవసరమెందుకనే విషయాన్ని తేల్చడం ద్వారా ఈ కేసు కీలక మలుపు తిరుగుతుందని దర్యాప్తు అధికారులు నమ్ముతున్నారు. ఇదే జరిగితే ఫోన్ ట్యాపింగ్ వెనుక రాజకీయ ప్రముఖుల పాత్ర బహిర్గతమవుతుందనేది వారి భావనగా కనిపిస్తోంది.

# చల్లటి కబురు చెప్పిన వాతావరణ శాఖ

## మూడు రోజుల పాటు వర్షా లు.. ఉరుములు లేని వర్షా లు కురుస్తాయని అంచనా



**మహా :** దంచి కొడుతున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. రానున్న రెండు మూడు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. వర్షాలు కురిసే సమయంలో మెరుపులు లేని మోస్తరు వర్షాలు ఉంటాయని తెలిపింది. ఇది ప్రజలకు కొంత ఉపశమనం కలిగించనుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అత్యధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు బయటకు వచ్చే పరిస్థితులు లేవు. ఏ జిల్లాలో చూసినా ఉష్ణోగ్రతలు అధిక మొత్తంలో నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో దంచికొట్టాల్సిన ఎండలు మార్చి నెలలో మాడు పగిలేలా చేస్తున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో 40 డిగ్రీలకిపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈ ఎండల కారణంగా ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రాలేకపోతున్నారు. అయితే హైదరాబాద్ వాతావరణ శాఖ ఏప్రిల్ 2, 3, 4 తేదీల్లో తెలంగాణలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. వర్షాలు కురిసే సమయంలో మెరుపులు, ఉరుములు, ఈదురుగాలులతో కాకుండా.. మోస్తరు వర్షాలు కురుస్తాయని తెలిపింది. అయితే నేటి నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు రాష్ట్రంలో పొడి వాతావరణమే కొనసాగుతుందని వాతావరణ శాఖ పేర్కొంది. వడగాలులు, అధిక ఉష్ణోగ్రతల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో.. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉష్ణోగ్రతలు మరింత పెరిగిపోతున్నాయి. ఇలాంటి సమయంలో హైదరాబాద్ వాతావరణ శాఖ ఈ తేలికపాటి వర్షాల ప్రకటనతో ప్రజలకు కొంత ఊరట కలిగిస్తుంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలు మిశ్రమ ప్రభావాన్ని చూపించాయి. వర్షాలతో కొన్ని ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయారు. పంట నష్టం అధికంగా చోటు చేసుకుంది. రైతులు పంటల విషయంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అయితే ఏపీలో కూడా ఉంటే ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాకు అమరావతి వాతావరణ కేంద్రం రెయిన్ అలర్ట్ ఇచ్చింది. అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ తమిళ నాడు వరకు ఉన్న ద్రోణి ప్రభావం దీనికి కారణం అని పేర్కొంది.

# రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూళ్లు

## ఖజానాకు కాసుల గల గల

## వెయ్యి కోట్లు దాటిన ఆస్తి పన్ను వసూళ్లు




**మహా :** రాష్ట్రంలో ఆస్తి పన్ను వసూళ్లు రూ. 1,000 కోట్ల మైలురాయిని దాటింది. నరో రెండు రోజులు చెల్లించేందుకు వీలుంది. రాష్ట్రంలోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఆస్తి పన్నుపై ఒకేసారి చెల్లింపునకు (వన్ టైమ్ సెటిల్మెంట్ ఓటీఎస్) తెలంగాణ ప్రభుత్వం అవకాశం కల్పించింది. పురపాలక శాఖ జీహెచ్ఎంసీ తరహాలో ఆస్తి పన్నుపై వడ్డీలో 90 శాతం రాయితీ ఇవ్వడంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో కలిపి ఇప్పటి వరకు రూ. 1,010 కోట్ల మేర ఆస్తి పన్ను వసూలైనట్లు పురపాలక శాఖ వెల్లడించింది. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10 శాతం వడ్డీ చెల్లించిన వారికి ఓటీఎస్ వర్తిస్తుందని పురపాలక శాఖ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. మార్చి 30, 31 తేదీల్లో సెలవు దినాలు అయినప్పటికీ ప్రజలు ఆస్తి పన్ను చెల్లించవచ్చని తెలిపింది. ఆస్తి పన్ను చెల్లింపు కోసం ఆన్ లైన్ సౌకర్యం అందుబాటులో ఎండటంతో ఈ వసూళ్ళు రానున్న రెండు రోజుల్లో మరింత పెగరవచ్చని అధికారులు భావిస్తున్నారు.

# బిలియనీర్ స్నేహితుల కోసం రూ.16 లక్షల కోట్లు మాఫీ

## ఇలాంటి అన్యాయాన్ని ఎదుర్కొంటే మీ ఆవేదన పంచుకోండి: రాహుల్ గాంధీ

**మహా:** ప్రతిపక్షనేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ బీజేపీపై మరోసారి విరుచుకుపడ్డారు. బీజేపీ ప్రభుత్వ తీరువల్లే బ్యాంకింగ్ రంగం సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. క్రోనిజం, దుర్వినియోగం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. బీజేపీ ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం మానవ నష్టాన్ని కలిగిస్తుందన్నారు. దీంతో ఒత్తిడి, కఠినమైన పని పరిస్థితులను జూనియర్ ఉద్యోగులు భరించాల్సి వస్తోందన్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. “బీజేపీ ప్రభుత్వం తన బిలియనీర్ స్నేహితుల కోసం రూ. 16 లక్షల కోట్లను మాఫీ చేసింది. ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం దేశవ్యాప్తంగా వేలాది మంది నిజాయితీపరులైన వృత్తి నిపుణులను ప్రభావితం చేస్తుంది.” అని చెప్పుకొచ్చారు. ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశానికి సంబంధించిన వీడియోని షేర్ చేశారు. నిర్వహణ లోపాల వల్ల వీరంతా నష్టపోయారని అన్నారు. కాంగ్రెస్ ఇలాంటి శ్రామిక శక్తుల నిపుణుల కోసం పోరాడుతుందన్నారు. పనిలో వేధింపులు, దోపిడీని అంతం చేస్తామని చెప్పుకొచ్చారు. “మీరు ఇలాంటి అన్యాయాన్ని ఎదుర్కొన్న వర్కింగ్ ప్రొఫెషనల్ అయితే మీ ఆవేదనను నాతో పంచుకోండి” అని రాహుల్ గాంధీ పోస్టు చేశారు.

# ఆంధ్రప్రదేశ్ వార్తలు AP NEWS

# రాష్ట్ర పండుగగా అనకాపల్లి నూకాంబిక జాతర

## అనకాపల్లి జిల్లా ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర



**అనకాపల్లి ,మహా :** అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ , ఎంపీ సీఎం రమేష్ కృషితోనే రాష్ట్ర పండుగగా నూకాలమ్మ జాతర ను ఈ ప్రభుత్వం ప్రకటించిందని అనకాపల్లి జిల్లా ఇంచార్జ్ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ని దర్శించుకున్న ఆయన ఈ సందర్భంగా మీడియా తో మాట్లాడారు. నూకాలమ్మ అమ్మవారి జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన తర్వాత మొట్టమొదటిసారి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం ఇంచార్జి మంత్రి గా ఉన్న నాకు రావడం అదృష్టంగా భావిస్తున్నాను అని తెలిపారు. అప్పటి టిడిపి ప్రభుత్వంలో నూకాంబిక అమ్మవారి ఆలయ అభివృద్ధికి ఐదు కోట్లు మంజూరు చేయగా కొన్ని అనివార్య కారణాలతో ఆ నిధులు నిలిచిపోయాయన్నారు. ఇప్పుడు మళ్లీ కోర్టు ఆదేశాలతో వడ్డీతో సహా 6 కోట్ల 20 లక్షలు వచ్చాయని పేర్కొన్నారు. తిరుపతి శ్రీవాణి ట్రస్టు ద్వారా కోటి 30 లక్షలు వచ్చాయన్నారు. వెరసి సుమారు 8:30 కోట్లతో అమ్మవారి ఆలయ పునర్నిర్మాణ పనులు సర్వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. త్వరలో ఆలయ పునర్నిర్మాణం పూర్తి అయ్యి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభం అవుతుందన్నారు. అన్నిమతాలను సమాంతరంగా గౌరవిస్తూ వారి గుళ్ళు గోపురాల అభివృద్ధికి సహకరిస్తూ సెక్యులర్ పాలన సాగించడమే ఈ ప్రభుత్వ ఆలోచన విధానం అని చెప్పుకొచ్చారు. టెంపుల్ టూరిజాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం కార్యాచరణ చేస్తుందన్నారు. ఇందుకు కేంద్ర ప్రభుత్వం కూడా పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు దేవాదాయ శాఖ బోర్డు సభ్యులు ,పలు శాఖల అధికారులు పలు నియోజకవర్గాల ఎమ్మెల్యే లు ,కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలుగు దేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



- ప్రతీ గ్రామంలో పార్టీ జెండా ఎగురవేసిన నాయకులు
- వాడవాడల ఘనంగా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**అనకాపల్లి జిల్లా ,నక్కపల్లి ,మహా :** పాయకరావు పేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి హోంమంత్రి క్యాంప్ కార్యాయం వద్ద టిడిపి నాయకులు జెండా ఆవిష్కరించి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలను మాలలు వేసి, నివాళులర్పించారు. ఎన్టీఆర్ కు జోహార్లు అంటూ నినాదాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. అణగారిన వర్గాలకు అండగా నిలిచింది పసుపు జెండానే అని నేతలు అన్నారు. నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం జెండాలను పాయకరావుపేట నియోజకవర్గంలో ప్రతీ గ్రామంలో ఎగురవేసి కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షలు,ముఖ్యనాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# శారదా పీఠం భూ ఆక్రమణలను తక్షణమే తొలగించాలి

- రాష్ట్ర తెలుగు శక్తి పార్టీ అధ్యక్షుడు బి.వి రామ్ డిమాండ్
- పెందుర్తి తహశీల్దార్ కు వినతి పత్రం అందజేత

**విశాఖ , పెందుర్తి ,మహా :** విశాఖ శ్రీ శారదాపీఠం లో ప్రభుత్వ భూమి ఆక్రమణను వెంటనే రెవెన్యూ అధికారులు తొలగించాలని రాష్ట్ర తెలుగు శక్తి పార్టీ అధ్యక్షులు బివి రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పెందుర్తి మండల తహశీల్దార్ కు బివి రామ్ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామ్ మీడియాతో మాట్లాడుతూ శారదాపీఠం హిందుత్వం ముసుగులో ప్రభుత్వములను ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడితే అధికారులు చోద్యం చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శారదపటానికి ఎటువంటి సమయం ఇవ్వకుండా ఆక్రమణలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు ఈ మేరకు శారద పీఠం భూములపై నారా లోకేష్ కు తెలియచేస్తున్నామని రామ్ తెలియజేశారు . దీనిపై తహశీల్దార్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ శారద పేటలో 22 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణ గురైనట్లు తమ సర్వేలో తేలిందని దీనిపై ఉన్నతాధికారులకు నివేదిక నిచ్చామని ఉన్నతాధికారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు.



# ఘనంగా టిడిపి 43 ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఏలూరు మహా:** ఏలూరు నగరంలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం కార్యాలయంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ 1983 సంవత్సరంలో ఎన్టీఆర్ పార్టీని స్థాపించి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంస్కరణలు చేసిన ఘనత ఎన్టీఆర్ దేనని అన్నారు. ఏలూరు శాసనసభ్యులు బడేటి చంటి మాట్లాడుతూ ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని కొనియాడారు.

# ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నాం

## జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ వైస్ చైర్మన్, టిడిపి నాయకులు అక్బర్ వెల్లడి




**ఏలూరు ,మహా:** ప్రభుత్వం ఇస్తున్న ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నాం అని జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ వైస్ చైర్మన్, టిడిపి నాయకులు అక్బర్ అన్నారు. ఏలూరు జిల్లా ఏలూరు గిరిజన భవన్ లో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంకు విచ్చేసిన ఆయన ఈ సందర్భంగా మాట్లాడారు. వక్ఫ్ బోర్డ్ లో కేంద్ర ప్రభుత్వం నిరంకుశంగా జోక్యాన్ని ముస్లింలు సహించరని అందుకే నేడు ప్రభుత్వం ఇచ్చిన ఇఫ్తార్ విందును బహిష్కరిస్తున్నామని కలెక్టర్ వెట్రి సెల్వికి తెలిపారు. అందుకే ఇఫ్తార్ విందుకు ముస్లింలు గైర్హాజరు అయ్యారని పేర్కొన్నారు. ముస్లింలకు జరుగుతున్న అన్యాయాన్ని మీ దృష్టికి తీసుకురావడానికి మేము 10 మంది వచ్చామని అన్నారు. ఎక్కడ జరిగిన పరిణామాన్ని మీరు సీఎం దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఇదే పరిస్థితి దేశ, రాష్ట్రవ్యాప్తంగా నెలకొని ఉందని అన్నారు. ముస్లింల సంక్షేమానికి పుణ్యం కోసం ఇచ్చిన భూములను ప్రభుత్వాల పెత్తనం సరైనది కాదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ వెట్రి సెల్వి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. రంజాన్ పండుగ సందర్భంగా కోటమి ప్రభుత్వం ఇస్తున్నా ఇఫ్తార్ విందులను ముస్లింలు రాష్ట్రవ్యాప్తంగా బహిష్కరిస్తున్నారు.

# అనకాపల్లి జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా..



## అనకాపల్లి ఎం.పీ.సీ.ఎం.రమేష్

**అనకాపల్లి ,మహా :** అనకాపల్లి జిల్లా అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఎం.పి సి.ఎం రమేష్ అన్నారు. అనకాపల్లి ఎం.పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు . అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్లమెంట్ లో చర్చించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల్లో ఏడు కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటుకు కేంద్రాన్ని కొరడం జరిగిందన్నారు. రెండు లక్షల కోట్లతో జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఎలమంచిలి పెందుర్తి పాయకరావుపేట నియోజకవర్గం కెమికల్ ఇండస్ట్రీలు.. మాడుగుల నర్సీపట్నం, చోడవరంలలో ఎస్.ఎం.ఈ ఇండస్ట్రీలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. త్వరలో అనకాపల్లి నుండి రాజమండ్రి వరకు ఆరు లైన్ల జాతీయ రహదారి విస్తరణకు పనులు ప్రారంభమవుతాయన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వ లేక వై.సి.పి నాయకులు చిల్లర చేష్టలు చేస్తున్నారని చెప్పారు. క్వారీల్లోనూ ట్రక్ రవాణాల్లోనూ నాకు సంబంధం ఉందంటూ అవాస్తవ ఆరోపణలు చేస్తున్నారని చెప్పుకొచ్చారు. మీకు దమ్ముంటే రండి మీడియా సమక్షంలో నిజా నిజాలు తేల్చుకుందాం అని సవాల్ విసిరారు. ఏ ఒక్క అవినీతిలో అయినా నాకు ప్రమేయం ఉందని తేల్చితే నేను దేనికైనా సిద్ధం అని అన్నారు.గత ఐదు సంవత్సరాల్లో వైసిపి నాయకులు అమర్నాథ్, ధర్మశ్రీ చేసిన దందాలపై విచారణ జరిపించి కేసులో నమోదు చేయిస్తాం అని తెలిపారు. ఈనెల 31వ తేదీన మునగపాకలో అనకాపల్లి అచ్చుతాపురం రోడ్లు విస్తరణ పనులకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేస్తారని తెలిపారు. అనకాపల్లి జిల్లాని టూరిజం రంగంలో అభివృద్ధి చేయడానికి ప్రణాళిక చేస్తున్నామన్నారు.ఆయన వెంట యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఉన్నారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

EDITORIAL సంపాదకీయం

# ఈ ఏడాది రాజపూజ్యమెవరికి?


ఉగాది అంటే గుర్తొచ్చేది ఉగాది పచ్చడి. పంచాంగం. కవితల పోటీలు. ఉగాది పంచాంగం పై తెలుగువారందరికీ ఆసక్తి ఉంటుంది. రాజపూజ్యం, రాజయోగం లెక్కలు వేసుకుని ఆ క్షణాన సంతృప్తి పడడం మామూలే. ఈ ఏడాది పాలకులకు, ప్రజలకు అన్నీ శుభాలేనని విశ్వావసు నామ సంవత్సరం కబురు మోసుకొచ్చింది. మంత్రివర్గ విస్తరణపై రకరకాల చర్చలు జరుగుతున్నా, శ్రీరామనవమి తర్వాతే స్పష్టత వస్తుందన్న అంచనాలున్నాయి. ముఖ్యమంత్రికి రేవంత్ రెడ్డి తులరాశికి ఈ ఏడాది తిరుగులేదని, రాజపూజ్యం, రాజయోగం మెండుగా ఉన్నాయని పంచాంగకర్తలు చెబుతున్నారు. దేశంలోను అత్యంత శక్తివంతమైన నేతల్లో 28వ ర్యాంకులో నిలిచిన సీఎం రేవంత్ రెడ్డి తెలుగునాట మోస్ట్ పవర్ ఫుల్ గా మారారు.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్**



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలుగు సంవత్సరాది అనగానే.. ఉగాది పంచాంగాలు జోరుగా సాగుతాయి. ఆధునిక కాలంలో.. ఎవరి పంచాంగం వారికి అనుకూలంగా చెప్పుకుంటున్నా జ్యోతిష్యులు, పండితులు భవిష్యత్తును ఊహించి చెప్పే ఈ పంచాంగం క్రేజ్ తగ్గలేదు. విశ్వావసు..అంటే విశ్వమంతటా సంపదను నింపేవాడు అని అర్థం. వసంత శోభతో, మామిడి తోరణాల సందడితో, షడ్రుచుల సమ్మేళనంతో తెలుగు వారి ఇంట సిరులొలికించే ఉగాది రోజున కొత్త పంచాంగ శ్రవణం ద్వారా రాబోయే సంవత్సర ఫలాలను తెలుసుకోవడం సంప్రదాయంగా వస్తోంది. ఈ ఏడాది పంటలు బాగా పండుతాయని, పాలకులకు, ప్రజలకు బాగుంటుందని చెబుతున్నారు. ఇక తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిణామాలను చూసుకుంటే.. రాజయోగం ఎవరికో, రాజపూజ్యం ఎవరికో.. ఈ జోస్యాలలో ఏవి నిజమో ముందుముందు తెలుస్తుంది.



తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హాట్ హాట్ చర్చ జరిగి.. మళ్ళీ ఒక్కసారిగా చప్పున చల్లారింది. నలుగురికి మంత్రివర్గ విస్తరణ ఖాయమని ప్రచారం జరిగిన తరుణంలో తమకు ఖచ్చితంగా ప్రాతినిధ్యం ఉండాలని ఎస్సీలో మాదిగవర్గ ఎమ్మెల్యేలు, ఎస్టీలో లంబాడ వర్గ ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తిచేశారు. బంజారా వర్గం నేతలు నేరుగా రాహుల్ గాంధీని కలిసి మంత్రివర్గంలో తమకు ప్రాతినిధ్యం ఉండాలని కోరారు. కొందరు ఎమ్మెల్యేలు నేరుగా.. ఢిల్లీకి వెళ్ళి ఖర్గేను రిక్వెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు ఒక పట్టాన తెగవు. పదవుల భర్తీపై కాంగ్రెస్ లో మోస్ట్ పవర్ ఫుల్ లీడర్ గా పేరున్న ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కూడా జనవరిలోనే పదవులన్నీ భర్తీచేయాలని ఆదేశించినా.. ఏదో ఒక అవాంతరం ముందుకు సాగనివ్వడం లేదు. గత పదిహేను మాసాలుగా తెలంగాణలోని దాదాపు సగం జిల్లాలకు, కీలక శాఖలకు మంత్రులు లేకున్నా పాలన సాగుతోంది. పదవుల భర్తీతో జోష్ వస్తుందని అధిష్టానం చెబుతున్నా, ఆశావహుల తాకిడితో భర్తీపై ఆచితూచి వ్యవహరిస్తోంది. మొదట ఏప్రిల్ 3న విస్తరణ జరుగుతుందని భావించినా తాజా రాజకీయ పరిణామాలతో ఏప్రిల్ 7,8 తేదీల్లో జరిగే ఎఐసిసి సమావేశం తర్వాతే ఇది ఉండొచ్చు. అయితే ఒక్క మంత్రివర్గమే కాకుండా మరికొన్ని నామినేటెడ్ పదవులు, పిసిసి కార్యవర్గం కూడా ఒకేసారి ప్రకటించాలన్న ప్రయత్నాల్లో ఉన్నట్లు కనబడుతోంది. ఇవి ఎప్పటికి తేలుతాయో నేతలకే అర్థం కాని పరిస్థితి ఉంది.

> **కాంగ్రెస్ పార్టీలో పదవులు ఒక పట్టాన తెగవు. పదవుల భర్తీపై కాంగ్రెస్ లో మోస్ట్ పవర్ ఫుల్ లీడర్ గా పేరున్న ఎఐసిసి జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ కూడా జనవరిలోనే పదవులన్నీ భర్తీచేయాలని ఆదేశించినా.. ఏదో ఒక అవాంతరం ముందుకు సాగనివ్వడం లేదు. గత పదిహేను మాసాలుగా తెలంగాణలోని దాదాపు సగం జిల్లాలకు, కీలక శాఖలకు మంత్రులు లేకున్నా పాలన సాగుతోంది. పదవుల భర్తీతో జోష్ వస్తుందని అధిష్టానం చెబుతున్నా, ఆశావహుల తాకిడితో భర్తీపై ఆచితూచి వ్యవహరిస్తోంది.**

> **మరోవైపు ఉప ఎన్నికలు రానే రావని తేల్చేయడం ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త ఆశలు కలిగించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు మొదటిసారి గెలవగా, నిధులు..ప్రగతి పరంగా తమ ముద్ర వేయకుంటే రాజకీయ భవిష్యత్ ఉండదని పలువురు ఆందోళన చెందుతున్నారు. సీఎం హామీతో మరో విడత ఆపరేషన్ ఆకర్ష్ కు అడుగులు పడుతున్నాయి. ఈ టర్మ్ లో విలీనం పక్కాగా చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉన్నట్లు కనబడుతోంది.**

> **బిజెపి తెలంగాణ అధ్యక్షుడిని తేల్చడం ఆ పార్టీ హైకమాండ్ కు తలకుమించిన భారంగా కనబడుతోంది. ఏడాదిన్నర కాలంగా ఎటూ తేల్చలేక వాయిదాల పద్ధతుంది దేనికైనా.. అంటోంది. కాంగ్రెస్ మంత్రివర్గం విస్తరణ, తెలంగాణ బిజెపి అధ్యక్షపదవి రెండూ విశ్వవాసు సంవత్సరంలో జరుగుతాయా? మళ్ళీ వచ్చే ఏడాది కూడా ఇదే చర్చ ఉంటుందా? అన్న అభిప్రాయాలు రాజకీయవర్గాల్లో వినబడుతున్నాయి.**

ఈసారి ప్రశాంతంగా అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. విపక్షాల మెప్పుపొందేలా సభ నిర్వహించడం ఆషామాషీ కాదు. అధికారపక్షం తొలిరోజు జగదీష్ రెడ్డి సస్పెన్షన్ ద్వారా సభను కట్టడి చేసినా, తర్వాత విపక్షానికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చింది. మునుపటి కంటే ఈసారి కాంగ్రెస్ సభ్యులు యాక్టివ్ గా ఉన్నా, విపక్షానికి ఉదారంగా సమయం కేటాయించి ప్రభుత్వంపై విమర్శలకు అవకాశమిచ్చారన్న చర్చ కూడా ఉంది. తాను కక్షా రాజకీయాలు చేయాలనుకుంటే కేసీఆర్ కుటుంబమంతా చర్లపల్లి జైల్లో ఉండేవారని సీఎం రేవంత్ రెడ్డి సభలో ఆవేదన వ్యకక్తం చేశారు. మరోవైపు విద్యుత్, కాళేశ్వరం కేసుల్లో మీరు జైలుకు పోక తప్పదనీ హెచ్చరించారు. బిసి బిల్లు, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం వంటి చారిత్రక అంశాలకు ఈసారి సభలో చోటు దక్కింది. అప్పుల లెక్కలపైనా ప్రజలకు మరింత అవగాహన పెరిగింది. ఈసారి బడ్జెట్ సమావేశాలు చరిత్రలో నిలిచిపోతాయంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్వయంగా పేర్కొనడం ప్రభుత్వవిజయానికి అద్దం పడుతుంది. బిల్లులు బాగున్నాయని అటు హరీష్, ఇటు కవిత ప్రశంసించారు. మరోవైపు ఉప ఎన్నికలు రానే రావని తేల్చేయడం ద్వారా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొత్త ఆశలు కలిగించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలలో కొందరు మొదటిసారి గెలవగా, నిధులు..ప్రగతి పరంగా తమ ముద్ర వేయకుంటే రాజకీయ భవిష్యత్ ఉండదని పలువురు ఆందోళన చెందుతున్నారు. సీఎం హామీతో మరో విడత ఆపరేషన్ ఆకర్ష్ కు అడుగులు పడుతున్నాయి. ఈ టర్మ్ లో విలీనం పక్కాగా చేసుకోవాలని కాంగ్రెస్ పట్టుదలగా ఉన్నట్లు కనబడుతోంది.

బిజెపి తెలంగాణ అధ్యక్షుడిని తేల్చడం ఆ పార్టీ హైకమాండ్ కు తలకుమించిన భారంగా కనబడుతోంది. ఏడాదిన్నర కాలంగా ఎటూ తేల్చలేక వాయిదాల పద్ధతుంది దేనికైనా.. అంటోంది. ఓ వైపు ఈటల రాజేందర్, మరో వైపు బండి సంజయ్ అంటూ ప్రచారాలు జరిగాయి. ఇపుడు మరో ఏడాది కిషన్ రెడ్డికి పొడిగింపు వచ్చిందన్న ప్రచారాలున్నాయి. కాంగ్రెస్ మంత్రివర్గం విస్తరణ, తెలంగాణ బిజెపి అధ్యక్షపదవి రెండూ విశ్వవాసు సంవత్సరంలో జరుగుతాయా? మళ్ళీ వచ్చే ఏడాది కూడా ఇదే చర్చ ఉంటుందా? అన్న అభిప్రాయాలు రాజకీయవర్గాల్లో వినబడుతున్నాయి. బిసి బిల్లు, ఎస్సీవర్గీకరణతో స్థానిక ఎన్నికలు ఎపుడు జరుగుతాయన్న అంశంపై గందరగోళ వాతావరణం కల్పించారు. స్థానిక ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకి కానుండగా, ఒక వేళ కోర్టులు ఆదేశిస్తే ఈ ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. హైడ్రాతో రియల్ రంగం కుదుపులకు గురికాగా, హైడ్రా భయాన్ని ప్రభుత్వం ఎలా తొలగించి మధ్యతరగతి ప్రజల్లో నమ్మకం కలిగిస్తుందన్న అంశం మీదనే ఈ రంగం కోలుకునే వేగం ఆధారపడి ఉంది. ప్రభుత్వం ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలు నిర్వహిస్తుందా, నేరుగా వచ్చే ఏడాది జీహెచ్ఎంసీ ఎన్నికలకు వెళ్తుందా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ఏడాదికాలంలో మరింత పట్టు సాధించగా, బీఆర్ఎస్ గత లోక్ సభ ఎన్నికల్లో గుండుసున్నాకే పరిమితమైంది. ఆ తర్వాత కూడా పుంజుకున్న ఆధారాలు ఏ ఎన్నికల్లోనూ కనబడలేదు. బిజెపి పుంజుకుంటున్న వాతావరణం ఉన్నా.. ఆ పార్టీ అంతర్గత సమస్యలు వేగాన్ని నియంత్రించే వాతావరణం ఉందన్న చర్చలున్నాయి. తెలంగాణలో ముక్కోణ రాజకీయాలున్నా.. ఈ ఏడాది పెద్దగా సంచలనాలకు ఆస్కార లేని వాతావరణం ఇపుడు కనబడుతోంది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.


మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp-
7436939999

## విశ్వావసు నామసంవత్సరం

# ఈ మూడు రాశులు పట్టిందల్లా బంగారమే

### మకరం, తుల, వృషభం ఈ ముగ్గురికి ఈ ఏడాది తిరుగులేదట

**మహా:** విశ్వావసు నామ సంవత్సరంలో శని సంచారంలో మార్పు వల్ల కొన్ని రాశుల వారికి అఖండ రాజయోగం పట్టబోతోందని ప్రముఖ జ్యోతిష్యుడు మాచిరాజు కిరణ్ కుమార్ తెలిపారు. 'విశ్వావసు నామ సంవత్సరం ఉగాది తర్వాత ద్వాదశ రాశులలోమూడురాశులకిశనిసంచారంలోమార్పు వల్ల అఖండ రాజయోగం పట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. జ్యోతిష్య శాస్త్ర ప్రకారం.. రాశులు రాజయోగాలపై ఆయన విశ్లేషణ ఇలా ఉంది. ఎప్పుడైనా సరే జన్మ రాశి నుంచి లెక్క పెట్టినప్పుడు వచ్చే మూడు, ఆరు, 11 రాశుల్లో శని భగవానుడు ఉన్నట్లైతే, శని భగవానుడు ఆ మూడు రాశులకి అఖండ రాజయోగాన్ని కలిగింపజేస్తాడు. ఉగాది తర్వాత శని సంచారంలో మార్పు వల్ల 12 రాశుల్లో మూడు రాశుల వాళ్లకి సంవత్సరం మొత్తం విశేషమైన రాజయోగం పట్టబోతోంది. ఆ మూడు రాశుల్లో మొట్టమొదటి రాశి 'మకర రాశి'.



**మకర రాశికి మహర్దశ**

కారణం ఏంటంటే 2025 సంవత్సరం మార్చి నెల 30వ తేదీ శని భగవానుడు కుంభ రాశిలో నుంచి మీన రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. మకర రాశి నుంచి లెక్క పెట్టినప్పుడు మకరం, కుంభం, మీనం. శని సంచారంలో మార్పు జరిగిన మీన రాశి మూడవ రాశి అవుతుంది. అంటే మకర రాశి వాళ్లకి ఉగాది తర్వాత శని భగవానుడు తృతీయంలో మూడో స్థానంలో సంచారం చేస్తున్నాడు. ఇది విశేషమైన రాజయోగాన్ని కలిగిస్తుందని మాచిరాజు తెలిపారు. మూడో స్థానంలో శని చాలా బలంగా ఉంటాడు. తృతీయంలో శని ఉన్నప్పుడు కష్టానికి తగిన ప్రతిఫలం కచ్చితంగా లభిస్తుంది. సోదరులతో ఉన్న గొడవలు తొలగిపోతాయి. ప్రాపర్టీస్ పరంగా విశేషమైన లాభం చేకూరుతుంది. అనుకున్న పనులు అనుకున్నట్లుగా మకర రాశి వాళ్లు దిగ్విజయంగా పూర్తి చేసుకుంటారు.

**తుల రాశికి విశేష రాజయోగం**

శని సంచారంలో మార్పు వల్ల విశేషమైనటువంటి రాజయోగం పట్టబోతున్న రెండవ రాశి 'తుల రాశి'. దానికి కారణం తుల రాశి నుంచి లెక్కపెట్టినప్పుడు శని సంచారంలో మార్పు జరిగినటువంటి మీన రాశి ఆరవ రాశి అవుతుంది. కాబట్టి, తుల రాశి వాళ్లకి శని భగవానుడు ఉగాది తర్వాత ఆరవ స్థానంలో సంచారం చేస్తున్నాడు. అంటే తుల రాశి వాళ్లకి ఉగాది తర్వాత అనారోగ్య సమస్యలన్నీ తొలగిపోతాయట. ఎంత పెద్ద అప్పులున్నా సరే త్వరగా బయటపడతారు. శత్రు బాధలు, దృష్టి దోషాలు తొలగిపోతాయి. అనుకున్న పనులు అనుకున్నట్లు పూర్తి చేసుకుంటారు. విశేషమైన ధన లాభాన్ని పొందుతారు' అని మాచిరాజు కిరణ్ కుమార్ చెప్పారు.

**'వృషభ రాశి' వారికి అఖండ రాజయోగం**

ఉగాది తర్వాత 'వృషభ రాశి' వారికి అఖండ రాజయోగం పట్టబోతోందని మాచిరాజు కిరణ్ కుమార్ పేర్కొన్నారు. కారణం ఏంటంటే వృషభ రాశి నుంచి లెక్కపెట్టినప్పుడు శని సంచారంలో మార్పు జరిగిన మీన రాశి 11వ రాశి అవుతుంది. అంటే మీన రాశి వాళ్లకి ఉగాది తర్వాత సంవత్సరం మొత్తం కూడా శని భగవానుడు లాభ స్థానంలో సంచారం చేస్తున్నాడు. 11వ స్థానంలో శని సంచారం ఉంటే కొద్దిగా కష్టపడ్డా 100 రెట్లు విశేషమైన ఫలితం ఉంటుంది. వృత్తిపరంగా అద్భుతమైన పురోభివృద్ధి, ప్రమోషన్లు వస్తాయి. కష్టానికి తగిన ప్రతిఫలం వస్తుంది. విశేషమైన ధన లాభం కలుగుతుంది. కుటుంబంలో అందరూ కూడా అత్యున్నత స్థాయికి వెళ్లగలుగుతారు.

## 12 రాశుల వారి ఆదాయం.. వ్యయాల లెక్కలు

కాలగమనంలో మరో ఏడాది. 2025 మార్చి 30నుంచి తెలుగువారి కొత్త సంవత్సరం ప్రారంభం కానుంది. ఉగాది పండుగ వస్తోందంటే చాలు.. హిందువులు అందరూ కొత్త ఏడాదిలో తమ పంచాగం ఎలా ఉంది.. ఆర్థిక వ్యవహారాలు ఎలా ఉంటాయి. ఎంత సంపాదన ఉంటుంది.. ఖర్చు ఏ మేరకు చేయాల్సి వస్తుంది. మనలను గౌరవించే వారి శాతం ఎంత.. అవమానించే వారు ఎందరు ఉన్నారు. కొత్త సంవత్సరంలో ఏ రాశి వారి జీవితం ఎలా సాగిపోతుంది.. కష్ట సుఖాలు ఎలాఉన్నాయి ... ఇలా అన్నీ లెక్కలు వేసుకుంటారు. పంచాంగ కర్తలు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వావశునామ సంవత్సరంలో 12 రాశుల వారి ఆదాయ .. వ్యయాలు.. రాజపూజ్యం.. అవమానం గురించిన వివరాలు ఇవీ

| రాశిపేరు | ఆదాయం | వ్యయం | రాజపూజ్యం | అవమానం |
|---|---|---|---|---|
| మేషరాశి | 02 | 14 | 05 | 07 |
| వృషభ రాశి | 11 | 05 | 01 | 02 |
| మిథునరాశి | 14 | 02 | 04 | 03 |
| కర్కాటక రాశి | 08 | 02 | 07 | 03 |
| సింహరాశి | 11 | 11 | 03 | 06 |
| కన్యారాశి | 14 | 02 | 06 | 06 |
| తులారాశి | 11 | 05 | 02 | 02 |
| వృశ్చికరాశి | 02 | 14 | 05 | 02 |
| ధనస్సురాశి | 05 | 05 | 01 | 05 |
| మకర రాశి | 08 | 14 | 04 | 05 |
| కుంభరాశి | 08 | 14 | 07 | 05 |
| మీనరాశి | 03 | 05 | 03 | 01 |

విశ్వావసు నామ సంవత్సరం తెలుగు పంచాంగం ప్రకారం 39 వ సంవత్సరం. ఈ సంవత్సరం 20252026 కాలంలో మార్చి 2025 నుండి మార్చి 2026 వరకు నడుస్తుంది. హిందూ సంప్రదాయంలో ప్రతి సంవత్సరానికి ఒక పేరు ఉంటుంది, ఇది జ్యోతిష్య గణన ఆధారంగా నిర్ణయించబడుతుంది. విశ్వావసు అంటే "విశ్వంలో సర్వమూ వసించేది" అని అర్థం, ఇది సమృద్ధి మరియు సంతులనాన్ని సూచిస్తుంది. ఈ సంవత్సరంలో రాశుల వారీగా ఆదాయం, వ్యయం, రాజపూజ్యం, అవమానం వంటి ఫలితాలు జ్యోతిష శాస్త్రం ద్వారా లెక్కించబడతాయి.

## దివ్యాంగుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి





వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

**వరంగల్ మహా :** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శనివారం దివ్యాంగులకు వయోవృద్ధులకు నిర్వహించిన ప్రత్యేక ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని దివ్యాంగుల సమస్యలపై వచ్చిన దరఖాస్తులు పై ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని సంబంధితఅధికారులనుఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా,అడిషనల్ కలెక్టర్ జి.సంధ్యారాణి , డిఆర్ఓ విజయలక్ష్మి , డి ఆర్ డి ఓ J. కౌసల్య దేవి డి డబ్ల్యు ఓ బి. రాజమణి పాల్గొని దివ్యాంగుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం దరఖాస్తులు (09) రాగా ఇందులో డిఆర్డిఓ 04, డి డబ్ల్యు ఓ 02, జడ్పీ సీఈవో 03, దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ఈ గ్రీవెన్స్ కి దివ్యాంగులు జిల్లా నలుమూలల నుంచి వివిధ రకాల సమస్యల తో వచ్చి దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తును సంబంధిత శాఖలకి ఎండార్స్ చేస్తూ వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో సంబంధించిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, దివ్యాంగులు& వయోవృద్ధుల జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఒవైసీ సహా ఎవరు అడ్డుపడ్డా

- వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు
- అతి త్వరలోనే పార్లమెంట్ ఆమోదించడం తథ్యం
- మజ్లిస్ దేశద్రోహ పార్టీ
- మతం కోణంలో అడ్డుకుంటే ప్రజలే తిరగబడతారు
- దేశం కోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోం



**కరీంనగర్, మహా:** భారత రాజ్యాంగానికి భవిష్యత్‌లో ఆర్ఎస్ఎస్ భావజాలంతోనే ముప్పు పొంచి ఉందంటూ మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మజ్లిస్ పార్టీయే అసలైన దేశద్రోహ పార్టీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం జాతీయవాద భావజాలంతో పనిచేస్తోందన్నారు. వక్ఫ్ బోర్డు బిల్లు పై దేశవ్యాప్తంగా మద్దతు లభిస్తోందన్నారు. ఒవైసీసహా కుహనా లౌకిక వాదులు ఎంత అడ్డుకున్నా పార్లమెంట్ లో అతి త్వరలోనే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును ఆమోదం పొందుతుందని స్పష్టం చేశారు. దేశం ప్రజల కోసం మోదీ ప్రభుత్వం మరిన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు వెనుకాడబోదని ఉద్ఘాటించారు. ఈరోజు కరీంనగర్ లోని జిల్లా కోర్టు కాంప్లెక్స్ లోని న్యాయవాదుల డిజిటల్ లైబ్రరీ కోసం బండి సంజయ్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులంతా బండి సంజయ్ ను సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అంజిరెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజ్ కుమార్, కార్యదర్శి బేతి మహేందర్, బాస సత్యనారాయణ, కోమాల ఆంజనేయులు తదితరులు హాజరై ప్రసంగించారు. అనంతరం బండి సంజయ్ మాట్లాడుతూ ఏమన్నారంటే... ప్రజల కోసం ఎన్నో పోరాటాలు చేసి కేసులు ఎదుర్కొన్న. 109 కేసులు నాపై ఉన్నాయి. పలుమార్లు జైలుకు పోయిన. ప్రతిసారి నన్ను కాపాడుతోంది న్యాయవాదులే. వారి సంక్షేమం కోసం అన్ని విధాలా సహకరిస్తా. న్యాయవాదుల కాన్ఫరెన్స్ కోసం సీఎస్సార్ ఫండ్స్ నుండి మరో రూ.50 లక్షల సాయం చేసేందుకు నావంతు క్రుషి చేస్తా.. వక్ఫ్ బోర్డు బిల్లు పై మజ్లిస్ నేత ఒవైసీ అడ్డగోలుగా మాట్లాడుతున్నడు. దేశమంతా వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతు పలుకుతున్నరు. ఒవైసీలాంటి ఎంత మంది వచ్చినా వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆగదు. పార్లమెంట్ లో ఆమోదించి తీరుతాం. ఈ దేశ ప్రజల ఆస్తిపాస్తులు కాపాడాల్సిన బాధ్యత మాపై ఉంది. వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై అందరి అభిప్రాయాలు తీసుకున్నాం. దేశమంతా తిరిగి అభిప్రాయాలను సేకరించాం. పార్లమెంట్ సంఘం సమావేశమై నివేదిక కూడా సమర్పించింది. అతి త్వరలో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందడం తథ్యం. మతం కోణంలో ఆలోచించి దీనిని అడ్డుకోవడం సరికాదు. అలాంటి వారిపై ప్రజలు తిరగబడే ప్రమాదం ఉంది.

## మిషన్ వ్యాపారస్తుల నూతన కమిటీకి ఏకగ్రీవ తీర్మానం



**వరంగల్, మహా :** వరంగల్ నగరంలోని వరంగల్ మార్కెట్ కమిషన్ వ్యాపారస్తులు ఓ వేడుక మందిరంలో శనివారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో 66 మంది కమిషన్ వ్యాపారస్తులు పాల్గొని నూతనంగా కమిటీ ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ కమిటీకి సోలా శ్రీనివాస్, కర్ర నాగేశ్వరరావు ను నియమించారు. తేదీ 0204 2025 బుధవారం ఉదయం 9:00 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఎన్నికలలో పోటీ చేయు అభ్యర్థి ఎన్నికల నిర్వహణ కమిటీకి తెలియజేయాలని మరల 04042025 శుక్రవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు నిర్వహించ బడుతాయి. పోటీ చేయదలచిన వారు అధ్యక్షులు, కార్యదర్శి కోశాధికారి పోటీలో ఉండగలరని పోటీ చేసేవారు కచ్చితంగా సమయపాలన పాటించాలని సమయం దాటిన తర్వాత పరిగణలోకి తీసుకోనబడదని సూచించారు. ప్రతి వ్యాపారస్తులు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించు కోవాలని ఎన్నికల కార్య నిర్వహణ కమిటీ సోల శ్రీనివాస్ కర్ర నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# భద్రాద్రిలో బ్రహ్మోత్సవాల మహోత్సవం ప్రారంభం

- ఏప్రిల్ 6న శ్రీ సీతారాముల కళ్యాణం – 7న పట్టాభిషేకం
- లక్షలాది భక్తులకు స్వామి వారి దర్శన భాగ్యం
- చాందినీ వస్త్రాలు, రంగు రంగుల విద్యుత్ దీపాలతో భద్రాచలం శోభ
- భద్రాద్రి బ్రహ్మోత్సవాల అద్భుత ఏర్పాట్లు
- 2 కోట్ల వ్యయంతో ఏర్పాట్లు
- స్వామివారి కళ్యాణం కోసం రెండు లక్షల లడ్డూల సిద్ధం
- తలంబ్రాల ఉచిత పంపిణీ – 60 కౌంటర్ల ద్వారా భక్తులకు అందుబాటులో
- ఉగాది పర్వదినంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవ వేడుకలు



**భద్రాచలం మహా :** శ్రీ భద్రాచలము - భారతీయ సంస్కృతికి ప్రతీక, భక్తికి నిలయం, సీతారాముల కల్యాణ క్షేత్రం. విశ్వావసు నామ సంవత్సర ఉగాది రోజున అంటే నేటి నుండి భద్రాచల శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానం ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల మహోత్సవం అంగరంగ వైభవంగా ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 12 వరకు వైభవంగా సాగనున్నాయి. ఆంధ్ర, తెలంగాణల గుండె చప్పుడైన భద్రాద్రి ఈ రోజుల్లో భక్తితో నిండిపోయి స్వామి వారి అనుగ్రహాన్ని పొంది ఉన్నది. ఏప్రిల్ 6న శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణం అద్భుతంగా జరగనుండగా, ఏప్రిల్ 7న స్వామి వారికి మహా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ పవిత్ర సందర్భాన్ని తిలకించేందుకు లక్ష మందికి పైగా భక్తులు భద్రాద్రిని సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. అందుకోసం రెండు కోట్ల రూపాయలతో సుదీర్ఘ ఏర్పాట్లు పూర్తి చేశారు.

**భద్రాద్రి మాంగల్యమయం – కళ్యాణ మహోత్సవ సన్నాహాలు**

భద్రాద్రి ఆలయ పరిసరాలు ప్రస్తుతం పండుగ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. ఆలయాన్ని చాందినీ వస్త్రాలతో ముస్తాబు చేయగా, రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలుగులు విరజిమ్ముతున్నాయి. భక్తులకు తలెత్తే ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**స్వాగతం భక్తులకు :** ప్రధాన మార్గాల వద్ద విశేష స్వాగత ద్వారాలు నిర్మించారు. విశ్రాంతి సౌకర్యాలు : శీఘ్ర దర్శనం కోసం ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయగా, భక్తుల విశ్రాంతికి చలువ పందిళ్లను నిర్మించారు. ప్రసాద సేవ : 19 ప్రత్యేక కౌంటర్ల ద్వారా నిరంతరంగా ప్రసాద పంపిణీ చేయనున్నారు. లడ్డూ తయారీ : భక్తుల కోసం రెండు లక్షల లడ్డూలను సిద్ధంగా ఉంచారు.

**తలంబ్రాల పంపిణీ :** స్వామివారి తలంబ్రాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు 60 కౌంటర్లు ఏర్పాటు చేశారు.

**ఆన్‌లైన్ టికెట్ సేవలు :** కళ్యాణం, పట్టాభిషేకం లాంటి ప్రధాన కార్యక్రమా లను ప్రత్యక్షంగా తిలకించేందుకు సెక్టార్ టికెట్లు ఆన్లైన్‌లో అందుబాటులో ఉంచారు.

**శోభాయమానంగా ప్రారంభోత్సవ వేడుకలు ఉగాది ప్రత్యేక సేవలు**

బ్రహ్మోత్సవాల తొలి రోజుగా ఉగాది వేడుకలు ఆలయంలోవైభవంగాజరుగనున్నాయి.ఉదయం 9 గంటలకు ఋత్విక్ వరణం, రక్షాబంధనం, స్వామివారి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం మృత్స్యం గ్రహణం, కళ్పవృక్ష వాహనంపై స్వామివారి తిరువీధి ఉత్సవం జరుగుతుంది. నూతన పంచాంగ శ్రవణం భద్రాచలంలో ఆలయ అర్చకులు ఈ సంవత్సరం ఫలితాలను వెల్లడించనున్నారు. అంకురార్పణ పూజలు - బ్రహ్మోత్సవాలకు అంకురార్పణగా శుభ ముహూర్తంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తికొండను తలపించే భద్రాద్రి గగనచుంబిగా వెలుగులు విరజిమ్ముతుంది. ఏప్రిల్ 6న జరుగబోయే కల్యాణోత్సవం భక్తజనులకు కన్నుల పండువుగా నిలవనుండగా, 7న పట్టాభిషేకం భద్రాచల మహోన్నత శోభను మరింత పెంచనుంది. భక్తి, భవ్యం, భద్రత – అన్నీ సమ్మిళితంగా సాగనున్న ఈ ఉత్సవాలు భక్తహృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆలయ అధికారులు వెల్లడించారు.

# అగ్నివీర్ కు

## లక్ష్మీపూర్ యువకుడి ఎంపిక



**సిరిసిల్ల,మహా :** రాజన్న సిరిసిల్ల జిల్లా అగ్నివీర్ కు తంగళ్ళ పల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన యువకుడు వట్టిమల్ల సాయితేజ ఎంపికయ్యారు.సాధారణ కుటుంబానికి చెందిన వట్టిమల్ల సాయితేజ స్థానికంగానే విద్యను పూర్తి చేశారు. తల్లిదండ్రులు లక్ష్మణ్ , రాణి లు వ్యవసాయ పనులు చేస్తూ కుమారుడిని చదివిపించారు.దీంతో పాటు లక్ష్మణ్ స్కూల్ కు ఆటో నడిపేవాడు.తల్లి దండ్రుల కష్టాన్ని చేస్తూ పెరిగిన సాయితేజ భారతదేశ సైన్యంలో చేరి దేశానికి సేవ చేయాలన్న సంకల్పంతో సాయితేజ గత రెండేళ్ళుగా కరీంనగర్ లో ఉంటూ శిక్షణ పొందుతున్నాడు.ఇటీవలే ప్రకటించిన అగ్నివీర్ జనరల్ డ్యూటీ కేటగిరి ఫలితాల్లో ప్రతిభకనబరిచి తన స్వప్నాన్ని సాకారం చేసుకున్నాడు.అగ్నివీర్ కు ఎంపికైన యువకుడు సాయితేజ ను గ్రామ యువకులు , పెద్దలు అభినందనలు తెలిపారు.

## పేదల పెద్ద ఆసుపత్రి ఎంజీఎం ను ప్రక్షాళన చేయండి

- తక్షణమే సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం
- అడిషనల్ డిఎంఈ పోస్ట్ ను భర్తీ చేయాలి
- పూర్తిస్థాయి సూపరింటిండెంట్‌ను నియమించాలి





**వరంగల్, మహా :** పేదల పెద్ద ఆస్పత్రి అయిన ఎంజీఎం ఆస్పత్రిని యుద్ధప్రాతిపదికన ప్రక్షాళన చేయాలని, వెంటనే తగిన నిధులు కేటాయించి సమస్యల్ని పరిష్కరించాలని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంజీఎంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద కు జిల్లా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అనంతరం కలెక్టర్ తో గంట రవికుమార్ మాట్లాడుతూ ఏళ్ల నుంచి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల పట్టింపు లేకపోవడంతో వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రి అధ్వానస్థితికి చేరిందన్నారు. ఆస్పత్రిలో సరిపడా బెడ్లు, వీల్‌చైర్లు, స్ట్రేచర్లు కూడా లేవని తెలిపారు. దశాబ్దాలుగా ఉత్తర తెలంగాణకు పేదలకు పెద్ద దిక్కుగా, వేలాది మంది ప్రాణాలు కాపాడిన ఎంజీఎం ఆస్పత్రి.. పాలకుల నిర్లక్ష్య వైఖరితో దయనీయంగా మారిందని అన్నారు. ఏళ్లు గడుస్తున్న ఖాళీలను భర్తీ చేయడం లేదని ప్రభుత్వాన్ని రవికుమార్ తప్పుబట్టారు. ఎంజీఎంకు ఇన్‌చార్జి సూపరింటిండెంట్ తోనే కాలం వెల్ల దీస్తున్నారని, దాంతో వైద్యులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక సిబ్బంది డబ్బుల కోసం రోగులను పీక్కుతుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంజీఎంలో వైద్య పరికరాలు అందుబాటులో లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, 2డి, ఈసీవో పరీక్షలు కరువయ్యాయన్నారు. సిటీ-ఎంజోగ్రామ్, ఆక్సీజన్ ప్లాంట్ యంత్రాలు వెంటనే మరమ్మతు చేయించాలని డిమాండ్ చేశారు. ఏఎంసీ, ఆర్‌సీయూ వార్డులో వంద పడకల చొప్పున అదనపు బెడ్లు వేయాలన్నారు. ఎంజీఎంలో సరిపడా బెడ్లు లేకపోవడంతో ఒకే బెడ్డు పై ఇద్దరు ముగ్గురు రోగులను పడుకోబెట్టాల్సిన దుస్థితి వచ్చిందని, పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని రవికుమార్ వాపోయారు. ముఖ్యంగా ఎంజీఎంలో వైద్య సేవలు అధ్వానంగా మారినా, పేదలు పడరాని పాట్లు పడుతున్న జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు చేతగాని దద్దమ్మాలుగా చూస్తూ ఉన్నారని రవికుమార్ తీవ్ర విమర్శలు చేశారు. ఎంజీఎంలో మరుగుదొడ్లు కంపు కొడుతున్నా ఎవరికీ పట్టడం లేదని మండిపడ్డారు. అంతేకాకుండా వార్డుల్లో ఫ్లోరింగ్ ఎక్కడికక్కడే తేలిపోయాయని, పైకప్పు నుంచి పెచ్చులు ఊడుతున్నాయని ఫ్యాన్లు కూడా పనిచేయకపోవడంతో కొందరు ఇంటి నుంచే తెచ్చు కుంటున్నారని ఎంజిఎం దుస్థితిపై కలెక్టర్ తో మాట్లాడడం జరిగింది.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా

- తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్..ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏసిపి నందిరాం నాయక్



**వరంగల్, మహా :** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని ఖిలా వరంగల్ ఈద్గాలో తవక్కల్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ పండుగ తోఫా నిత్యవసర వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉర్సు దర్గా పీఠాధిపతి సయ్యద్ ఉబేద్ బాబా, వరంగల్ ఏసిపి నందిరాం నాయక్ పాల్గొని తవక్కల్ ట్రస్టు చైర్మన్ ఎంఏ జబ్బర్ ను అభినందిస్తూ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించినందుకు జబ్బర్ ను అభినందిస్తూ మునుముందు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎన్నో చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మిల్స్ కాలనీ సీఐ జూపల్లి వెంకటరత్నం, 41 డివిజన్ కార్పొరేటర్ పోశాల పద్మ స్వామి గౌడ్, ముస్లిం పెద్దలు, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి చాంద్ పాషా, కమిటీ సభ్యులు ఎండి మగ్దూం మీర్జా హసన్ బేగ్ దస్తగీర్ గఫార్, తదితరులు, పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

మంత్రి కొండా సురేఖ



**వరంగల్ మహా :** రాష్ట్ర ప్రజానీకం, ఉమ్మడి వరంగల్ వాసులకు తెలంగాణ అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఉగాది పర్వదినం సందర్భంగా శనివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు మంత్రి శనివారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు నెలకొని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. తెలుగు సంవత్సరాది అయిన ఉగాది మన సంప్రదాయాలను, సంస్కృతిని ప్రతి బింబించేది మాత్రమే కాకుండా, నూతన ఆశలు, కొత్త లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లే అద్భుతమైన శుభదినమని సురేఖ పేర్కొన్నారు. ఉగాది పచ్చడి మాదిరిగా జీవితం కూడా చేదు, తీపి, కారం, వగరు, పులుపు, ఉప్పు రుచులతో కూడి ఉంటుందని, సమస్యలను సమర్థంగా ఎదుర్కొంటూ విజయపథంలో ముందుకు సాగాలని ప్రజలను కోరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ తెలుగు భాషా గౌరవం, సంస్కృతి పరిరక్షణ, వ్యవసాయ రంగం అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెంపుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత శ్రద్ధ చూపించాలని సూచించారు. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు కొత్త సంవత్సరంలో మరింత మంచి జరగాలని కోరుకుంటున్నాను.

## బేటి బచావో బేటి పడావో

### జిల్లా స్థాయి సమీక్షా సమావేశం



**వరంగల్ మహా :** జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో బేటి బచావో బేటి పడావో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేటి బచావో బేటి పడావో 20252026 యాక్షన్ ప్లాన్ ను జిల్లా సంక్షేమ అధికారి రాజమణి లైన్ డిపార్ట్మెంట్స్ మరియు కమిటీ సభ్యులకు వివరించడం జరిగింది. ఇట్టి యాక్షన్ ప్లాన్ లో ఏదైనా సలహాలు సూచనలు ఉంటే ఇవ్వమని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ రామ్ రెడ్డి డి ఆర్ డి ఓ కౌసల్య దేవి , డి ఎం అండ్ హెచ్ ఓ సాంబశివరావు, జెండర్ ఈక్విటీ కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్ ,జిల్లా పరిధి లీగల్ సర్వీసెస్ అథారిటీ అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ రజిని , మెప్మా రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ డే వేడుకలు

### అలరించిన చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు..






**నర్సంపేట, మహా :** మండలంలోని ఇటుకాలపల్లి ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్కూల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి కొర్ర సారయ్య హాజరయ్యారు. జెడ్పిఎస్ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల నివేదికను సీనియర్ ఉపాధ్యాయులు జీ.కిరణ్ సమర్పించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. తెలంగాణ జాగృతి కళాకారులు నెల్లుట్ల సుమన్ టీం కల్చరల్, ఫోక్, సినిమా సాంగ్స్ తో కార్యక్రమాన్ని రసవత్తరంగా కొనసాగించారు. మిమిక్రీ ఆర్టిస్ట్ బొమ్మ శ్రీనివాస్ మిమిక్రీతో ఆకట్టుకున్నారు. మార్షల్ ఆర్ట్స్ లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. జెడ్పిఎస్ఎస్ ఇటుకాలపల్లి పాఠశాల మొదటి బ్యాచ్ టాపర్ నాంపల్లి మురళీధర్ పాఠశాలతో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. ఇరవై ఏండ్ల కిందట ప్రభుత్వ పాఠశాల వసతులతో పోల్చితే ప్రస్తుతం చాలా మెరుగైనట్లు తెలిపారు. అప్పట్లో సిబ్బంది కొరతతో ఒక టీచర్ రెండు సబ్జెక్ట్స్ చెప్పే పరిస్థితి ఉండేదని,ప్రస్తుతం నిష్ణాతులైన బోధన సిబ్బంది ఉన్నరన్నారు. మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాల వంటి పలు పథకాలతో పాఠశాల స్వరూపం మారిపోయిందన్నారు. తరగతి గదుల్లో నూతన బెంచీలు, కంప్యూటర్ ల్యాబ్, తాగునీటి సౌకర్యం, టాయిలెట్స్ సహా పలు మౌళిక వసతులు అందుబాటులోకి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ మహేశ్వరి, కొన్కటి. గణేష్ (స్థల దాత), మేర్లు, శ్రీనివాస్, సున్నపు.కొమ్మాలు, కట్ల, సుధాకర్, భూక్య, వీరన్న, జమాండ్ల, చంద్రమౌళి, తాళ్ళ పెల్లి, అశోక్, బోరగాని కృష్ణ, బొడిగే వినయ్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు మంగ్య, శ్రీనివాస్, డీ. రవీందర్, హార్య, కిరణ్, ఏ. రవీందర్, కల్పనాదేవి, నాజ్ ఫాతిమీ, డానియల్ పాల్, సుధాకర్, ప్రతాప్, రఘుపతి, ప్రభాకర్, వెంకటయ్య, ఆండాళు, అరుణ, చందన, శ్రీలత, శ్రీనివాస్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణము




**హుజూర్ నగర్, మహా:** మఠంపల్లి మండలం, మట్టపల్లి మహాక్షేత్రం లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు తేది:30032025 ఆదివారం తెలుగు సంవత్సరాది అనగా ఉగాది విశ్వావసునామ సంవత్సరంను పురస్కరించుకొని స్వామివారికి ప్రాతః కాలము నుండి ప్రత్యేక పూజలు, అభిషేకములు, విశేష అర్చనలు దేవాలయ అర్చకులచే నిర్వహించబడును. సాయంత్రం 5:00 గంటల నుండి పంచాంగ శ్రవణము కార్యక్రమం అత్యంత వైభవముగా నిర్వహించబడును.

## శనీశ్వరుడి ఆలాయానికి భక్తుల తాకిడి

### కిలో మీటర్ మేర క్యూలైన్లు



**ఆదిలాబాద్, మహా :** శని అమావాస్యతో పాటు తెలుగు ఏడాది క్రోధనామసంవత్సరానికి చివరి రోజు కావడంతో పట్టణంలోని శనిశ్వరుడి ఆలయం భక్తులతో కిటకిటలాడింది.ఉదయం నాలుగు గంటల నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి ఆశనిశ్వరుడి దర్శన భాగ్యం కోసం బారులు తీరారు. ఆలయానికి రెండు వైపులా కిలోమీటర్ పొడవున క్యూలైన్ల లో స్వామివారి దర్శనార్థం గంటల తరబడి నిరీక్షించారు. వేకువజాము నుంచే ప్రత్యేక పూజాధికాలు, తైలాభిషేకాలతో ఆలయం ప్రాంగణంలో ఆధ్మాత్మిక శోభ నెలకొంది. ఆదిలాబాద్ పట్టణం నలుమూలల నుంచే కాకుండా చుట్టు పక్కల గ్రామాలు, పల్లెల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి శనిశ్వరుడి సేవలో తరించిపోయారు. అటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.వినాయక్ చౌక్ సైడ్ వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఒకవైపున రోడ్డును బ్లాక్ చేశారు. శని అమావాస్య రోజున శనిశ్వరుడిని దర్శించుకుంటే ఏలినాటి శని, తమను పట్టిపీడిస్తున్న దోషాలను తొలగిపోయి శుభం కలుగుతుందని భక్తుల ప్రగాఢ నమ్మకం. అందుకే శని అమావాస్యను అంత ప్రత్యేకతగా భావిస్తారు. శనిశ్వరుడికి ఆవనూనెలో కలిపిన నువ్వులు సమర్పించి మొక్కులు చెల్లించగా మరికొందరు నల్లని వస్తువులను సైతం దానంచేసి నవగ్రహాలను పూజించారు. అమావాస్య తిథిని హిందూ మతంలో చాలా పవిత్రంగా భావిస్తారు. ఈ అమావాస్య తిథుల్లో శని అమావాస్య చాలా ప్రత్యేకమైనది. శని అమావాస్య ప్రతి సంవత్సరం అరుదుగా వస్తుంది.

## గ్రామీణప్రాంతాల అభివృద్ధికి కార్పోరేట్ సంస్థలు
# ముందుకురావడం హర్షనీయం
## రాష్ట్ర మంత్రి సీతక్క

**ములుగు, మహా :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సీఆర్ఎస్ నిధులతో కార్పరేట్ సంస్థలు ముందుకు రావడం హర్షనీయమని రాష్ట్ర పంచాయితి రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ములుగు మండలం లోని జగ్గన్నపేటలో నిర్మాణ్ ఆర్గనైజేషన్, ఓపెన్ టెక్స్ట కార్పొరేట్ సంస్థల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను అదనపు కలెక్టర్లు మహేందర్ జి, సంపత్ రావులతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల అధికారులు మారుమూల గిరిజన గ్రామాలను దత్తత తీసుకోవడం హర్షించదగ్గ విషయమని, జిల్లాలోని ఏడు గ్రామాలను నాలుగు నెలల క్రితం దత్తత తీసుకొని గ్రామ సభలలో ప్రజలు నిర్ణయించిన పనులను పూర్తి చేయడం చెప్పుకోదగ్గ విషయమై అన్నారు. జగ్గన్నపేట గ్రామంలో విద్యార్థినీ విద్యార్థులకు మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు ఆట వస్తువులను అందజేశారని, సోలార్ లైట్లు, వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి మంచినీటిని అందించనున్నారని అన్నారు. ఇదే తరహాలో ఎల్బీనగర్ గ్రామ ప్రజలు కోరిక మేరకు ఆటో, సైకిళ్లు గేదెలను అందించారని వివరించారు. కార్పొరేట్ సంస్థల యజమానులు గ్రామీణ ప్రాంతాలను మరో మూడు సంవత్సరాలు దత్తత తీసుకున్న పక్షంలో గ్రామీణ ప్రాంతాలు పట్టణాలుగా మారిపోతాయని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ







పథకాలను ప్రవేశ పెడుతుండగా మరోవైపు కార్పొరేట్ సంస్థలు సిఎస్ఆర్ నిధులు వెచ్చిస్తూ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని, సి ఎస్ ఆర్ నిధులు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని సీతక్క అన్నారు. సీఎస్ఆర్ నిధులతో కోటి 25 లక్షలతో 5 గ్రామాల్లో గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి వివరించారు. అనంతరం ములుగు మండలం లోని ఇంచెంచెరువు పల్లె లో సర్వీస్ నౌ సంస్థ ద్వారా 25 లక్షల 50 వేలతో గిరిజన గ్రామ దత్తత అభివృద్ధి కార్యక్రమపనులను మంత్రి ధనసరి సీతక్క, నిర్మాణ్ ఆర్గనైజేషన్, పట్నాల, సర్వీస్ నౌ సంస్థ ప్రతినిధులు విద్యానంద, స్నేహ లత, అదనపు కలెక్టర్లు సి హెచ్ మహేందర్ జి, సంపత్ రావు లతో కలసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ టెక్స్ట ఇండియా వైస్ ప్రెసిడెంట్ జనీరింగ్, సైట్ లీడర్, సైట్ సంగీత యనమంద్ర, వ్యవస్థాపకులు & గ్లోబల్ సీఈవ్, నిర్మాణ్ ఆర్గనైజేషన్, మయూర్ పట్నాల, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు తెలుగు నూతన
## సంవత్సరాది ఉగాది శుభాకాంక్షలు



**వరంగల్, మహా :** వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలందరికీ వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తెలుగు నూతన సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసే పండుగ ఉగాది అన్నారు. ఉగాది పచ్చడిలాగా ప్రతి ఒక్కరి జీవితం షడ్రుచుల సంగమంగా మారాలని కోరారు. ప్రజల జీవితాల్లో వసంతాన్ని నింపే విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. సరికొత్త ఆశలు, నిండైన నవ్వులు ఆనందాలతో ఉగాది ఆహ్వానించాలన్నారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలకు శుభం కలగాలని వారి ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆకాంక్షించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షల కనుగుణంగా పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలోని పేద ప్రజలందరికీ మరిన్ని అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసి ఉగాది పండుగను ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## బడుగు బలహీన వర్గాలను అభివృద్ధి చేసిందే టీడీపీ
### టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో నియోజకవర్గ అడ్ హాక్ కమిటీ మెంబర్ అడుప నర్సింగరావు



**నర్సంపేట, మహా :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నర్సంపేట నియోజకవర్గ అడ్ హాక్ కమిటీ మెంబర్ అడుప నర్సింగరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి అనంతరం జెండా ఆవిష్కరించారు.అనంతరం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో కేక్ కట్ చేశారు.ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను అభివృద్ధిని చేయడం కోసం పుట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఆనాడు పేదవాడి ఆకలి తీర్చడానికి అన్న నందమూరి తారక రామారావు తీసుకున్న నిర్ణయమే తెలుగుదేశం పార్టీ అని, రెండు రూపాయలకే కిలో బియ్యం,కూడు గుడ్డ నినాదంతో, పటేల్ పట్వారి వ్యవస్థను రద్దు చేస్తూ మహిళలకు ఆస్తిలో హక్కును కల్పిస్తూ ఇలా ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చిందని, బీసీలకు రాజ్యాధికారం ఇచ్చి రాజకీయంగా ముందుకు నడిపించింది తెలుగుదేశం పార్టీ అని అన్నారు. మొట్టమొదటి సారి పార్లమెంట్ లో దళితుడిని స్పీకర్ ను చేసిందని, తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా రెవెన్యూ అందిస్తున్న హైదరాబాదును తీర్చిదిద్దింది తెలుగుదేశం పార్టీ నే అని,ఈరోజు తెలుగు రాష్ట్రాల్లో కీలకంగా ఉన్న ప్రతి ఒక్కరూ తెలుగుదేశం పార్టీలో ఓనమాలు నేర్చుకొని వెళ్లిన వారేనని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ఎంతో సమర్థవంతంగా పనిచేస్తుందని,రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బలమైన శక్తిగా టీడీపీ ఎదుగుతుందని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొక్కుజం పయ్య,వేములపల్లి సూర్య ప్రకాష్ రావు,నాయిని కుమార్,అల్లాడి వెంకట నారాయణ,మండల సదానందం,పంచమర్తి రామారావు,తోట వెంకన్న,పుల్లూరు కుమారస్వామి,ఎండీ బషీర్,కోలిపాక పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆహ్వానించిన



### ముస్లిం మైనార్టీ నాయకులు

**మేళ్లచెరువు, మహా:** మేళ్లచెరువు మండలంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ఆత్మీయ విందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులను మైనార్టీ అధ్యక్షులు నాగుల్ మీరా స్వయంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులను కలిసి సాయంత్రం ఇఫ్తార్ విందుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీపార్టీ ముఖ్య నాయకులు మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, దేవాలయ చైర్మన్ శాగం రెడ్డి శంబి రెడ్డి, ఎక్స్ ఎంపీపీ కొట్టే పద్మశారేశ్వరరావు, ఎక్స్ జెడ్పిటిసి గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్ శెట్టి రామచంద్రయ్య, ఎక్స్ ఎంపీటీసీ శంభయ్య, నరసింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బండ్ల బిక్షం మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను ఆహ్వానించినారు.

## నేడు సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయండి
### కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు



**మెల్లచెరువు,మహా:** మేళ్లచెరువు మండల కేంద్రంలో తెలంగాణ సీఎం రేపు హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో జరుగు భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని మండల నాయకులు అన్నారు. మేళ్లచెరువు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పెద్ద ఎత్తున పెద్ద ఎత్తున తరలించాలని వారికి బస్సు సౌకర్యాలు ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా జాగ్రత్తగా వెళ్ళే విధంగా తగు జాగ్రత్తలు తీసుకునేలా మేళ్లచెరువు కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య నాయకులు చర్చించుకున్నారు.ఇట్టి సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, దేవాలయ చైర్మన్, షాగం రెడ్డి శంబి రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి గోవిందరెడ్డి,ఎక్స్ ఎంపిటిసి శంభయ్య, ఓబీసీ చైర్మన్ శెట్టి రామచంద్రరావు, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్, గ్రామ శాఖ అధ్యక్షులు పండ్ల బిక్షం పాల్గొన్నారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు
### సాముల రాంరెడ్డికి సన్మానం

**హుజూర్ నగర్, మహా:** హుజూర్నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన సామల రామ్ రెడ్డికి శనివారం హుజూర్నగర్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హుజూర్నగర్ అసోసియేషన్ చరిత్రలో అత్యధికంగా అధ్యక్షుడిగా పనిచేసి ప్రజల ఆదరభిమానులు పొందుతున్న రాంరెడ్డి మునుముందు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, అత్యధిక సార్లు అధ్యక్షుడిగా పని చేస్తూనే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా ఎన్నికై భక్తులకు స్వామివారి దర్శనాన్ని ఇప్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, టి పి సి సి అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఈదుప్పుగంటి సుబ్బారావు, టిపిసిసి సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, కె నాగేశ్వర రావు, పారుపల్లి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## సీఎం బహిరంగ సభను
# విజయవంతం చేయాలి



**మేళ్లచెరువు, మహా:** ఉగాది పర్వదినాన రేవంత్ రెడ్డి మహత్కరమైన కార్యాన్ని నేడు దేశంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం అది కూడా మన నియోజకవర్గము నుంచి అమలు కావడం నిజంగా మన అదృష్టంగా భావించాలి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తన మాటలో చెప్పుకొచ్చారు. అదేవిధంగా మొట్టమొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం ప్రారంభించడం మన రాష్ట్రం ముందున్నట్టు ఏ రాష్ట్రంలో లేదని భారత దేశంలో మొట్టమొదటిసారి మన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగటం విశేషంగా చెప్పుకొచ్చారు ఉగాది రోజు ప్రతి ఒక్కరు హుజూర్నగర్ రేవంత్ రెడ్డి మీటింగ్ కు అటెండ్ కావాలని పిలుపునిచ్చారు ప్రతి గ్రామంలోనూ మండలానికి సుమారు 20 నుంచి 30 బస్సులు పెట్టడం విశేషం ఆడవారికి ఆశ వర్కర్స్ కి ప్రత్యేకంగా గవర్నమెంట్ బస్సులు కేటాయించినట్టు అవేకాకుండా ప్రైవేట్ బస్సులు కూడా కేటాయించి ప్రైవేటు వెహికల్స్ ఏమున్న విలేజ్ కి వెయ్యి మంది తగ్గకుండా హాజరుకావాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలియజేశారు. అదే విధంగా రైతులకు నీరు అందించే విషయంలో వడ్లు కొనుగోలు చేసే విషయంలో రైతుకు ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. నేడు ప్రజలను చేరవేసే విషయంలో అన్ని విధాల తగు జాగ్రత్తలు వహించాలని ఉగాది పర్వదినాన ప్రతి ఒక్కరి కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా ముందుకు పోతుందని ఈ విషయమై ప్రజలుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటుందని ఉత్తంకుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి బహిరంగ సభను ఒక ఛాలెంజ్గా తీసుకొని గ్రామాలలో ఒక్కరు కూడా ఉండకుండా ప్రతి ఒక్క రోజు నగర్లో ఉగాది పండుగ చేసుకోవాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బడి ఈడు పిల్లలను బడికి పంపించాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని పాలడుగు గ్రామంలోని బడిఈడు పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని ప్రధానోపాధ్యాయులు, వై కమలాకర్ రెడ్డి, ఉద్బోధించారు. మండలంలోని పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో 75 సంవత్సరాల, వజ్రోత్సవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . పిఎంఎస్హెచ్ఆర్ఐ నిధులతో, ఎస్డిఎఫ్ నిధులతో పాఠశాల చాలా సుందరంగా తయారైందని అనేక వసతులు సమకూర్చబడినాయని గ్రామంలోని పిల్లలందరినీ మన ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ యాదయ్య గారు పిలుపునిచ్చారు.


1950లో ప్రారంభమైన ఈ పాఠశాలలో గ్రామంలోని వేవేల మంది విద్యార్థులు అభ్యసించారని, ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని, వారందరూ ప్రభుత్వ పాఠశాలకు హితోధికంగా సహాయ సహకారాలు అందించాలని మాజీ మండల విద్యాశాఖ అధికారి శ్రీ బద్దం యాదిరెడ్డి గారు అందరిని కోరినారు. కార్యక్రమంలో ఏఎపిసి చైర్మన్ పబ్బు అరుణ, మాజీ ఎంపీటీసీ అంతటి నరసయ్య, వివిధ మండలాల నుంచి వచ్చిన అనేకమంది ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, గ్రామ యువత, పాఠశాల ఉపాధ్యాయ బృందం అందరూ పాల్గొనినారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలతో అందరిని అందించారు.

## బొందయ్య పార్థీవదేహానికి
## నివాళులర్పించిన సిఐటియు నాయకులు



**హుజూర్ నగర్,మహా:** మఠంపల్లి మండలం వరదాపురం గ్రామపంచాయతీ సిబ్బంది నందిపాటి బొందయ్య అనారోగ్య కారణంతో మరణించడం జరిగింది. మఠంపల్లి మండల సిఐటియు కన్వీనర్ రన్మియా, మండల అధ్యక్షుడు భూక్య సైదా నాయక్ ఇంటి రవి ,బానోతు బాలకృష్ణ, మాలోతు లక్ష్మణ్, సంతోషం, రహీం, సతీష్ గ్రామపంచాయతీ కార్మికులు అందరూ వారి కుటుంబాన్ని పరామర్శించి పార్థదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి
### ముఫ్టి మొహమ్మద్ గౌసుద్దీన్



**హుజూర్ నగర్, మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు ముస్లిం మైనార్టీలు ఉపవాస దీక్షలలో తీవ్ర ఎండలలో కుడి చేతికి నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుత నిరసన భారీ ర్యాలీ ఉస్మానియా మస్జిద్ నుండి ఇందిరాచౌ వరకు ఇందిరా చౌక్ నుండి ఉస్మానియా మస్జిద్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా మస్జిద్ ముఫ్టి మహమ్మద్ గౌస్ ఉద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024లో తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలోని మేధావులు అన్ని రాజకీయ పార్టీలు వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి శాసనసభలో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ముస్లిం మైనార్టీ నాయకులు మరియు ముస్లిం పెద్దలు ముస్లిం యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

## మందుల సామేల్ కు
## మంత్రి పదవి ఇవ్వాలి



**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రం నిత్యం జనం మధ్యలో ఉండే వ్యక్తి,తన వయస్సును సైతం లెక్క చేయకుండా ప్రజా సమస్య పరిష్కారానికై నడుం బిగించి ముందుకు సాగె జన నాయకుడు,పేద ప్రజలకు సేవ చేయాలానే తపనతో రాజకీయలలో అడుగు పెట్టిన తెలంగాణ ఉద్యమకారుడు, రైతు బంధావుడు, ఇప్పటి వరకు తుంగతుర్తి నియోజకవర్గం లో దాదాపు 1400 కోట్లతో అభిరుద్ధి పనులు చేసిన జన నాయకుడు సామేలు, మాదిగ సామాజిక వర్గం నుండి వచ్చిన సామేలు, కు మంత్రి పదవి ఇవ్వడం వలన వెనుకబడిన తుంగతుర్తి నియోజకవర్గన్ని అన్ని విధాలుగా అభిరుద్ధి చేసుకోవడానికి ఒక అవకాశం ఉంటుంది, కావున తుంగతుర్తి ప్రజల కోరిక మేరకు ముఖ్యమంత్రి, ఏనుముల రేవంత్ రెడ్డి, అలోచించి మా తుంగతుర్తి శాసనసభ్యులు, మందుల సామేలు, కి మంత్రి వర్గంలో సముచిత స్థానం కలిపించాలని, రాచకొండ బాలరాజు గౌడ్, మోత్కూర్ మండల ప్రధానకార్యదర్శి, అన్నారు.

## ఘనంగా పౌరహక్కుల దినోత్సవం

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని అంబేద్కర్ నగర్ లో మోత్కూర్ డి.టీ ఉపేందర్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఆదేశానుసారం ఏర్పాటు చేసిన (సివిల్ రైడ్ డే) పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న, యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్సి ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ దాసరి తిరుమలేష్, కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ దళితుల సమస్యలు తెలుసుకొని వారి సమస్య పరిష్కరించడం కోసం ప్రభుత్వనికి సంబంధిత అధికారుల దృష్టికి చేరవేసి వారి సమస్యల పరిస్కారం కోసం పనిచేస్తానని ఎస్సి ఎస్టిలపై కుల వివక్షత చూపినట్లు అయితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి




వస్తుంది అని అన్నారు కార్యక్రమంలో మోత్కూర్ ఎస్ ఐ నాగరాజు, పిహెచ్సి డాక్టర్ హేమంత్, అగ్రికల్చర్ ఆఫీసర్ స్వప్న, ఎస్సి బాలుకల హాస్టల్ వార్డెన్ రాజాలు బాయి, ఆర్ఐ సుమన్, మున్సిపాలిటీ మేనేజర్ ప్రభాకర్, ఎడ్ల శ్రీకాంత్ కాలనీ వాసులు మర్రి అనిల్, మాజీ ఎంపిటిసి కురిమిళ్ల ప్రమీల, బోడ శ్రీను, గుంటి ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయంలో పంచాంగ శ్రవణము

**హుజూర్ నగర్, మహా:** మఠంపల్లి మండలం, మట్టపల్లి మహా క్షేత్రం లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం నందు తేది:30 032025 ఆదివారం తెలుగు సంవత్సరాది అనగా ఉగాది విశ్వావసునామ సంవత్సరం ను పురస్కరించుకొని స్వామి వారికి ప్రాతః కాలము నుండి ప్రత్యేక పూజలు, అభిషేకములు, విశేష అర్చనలు దేవాలయ అర్చకులచే నిర్వహించబడును. సాయంత్రం 5:00 గంటల నుండి పంచాంగ శ్రవణము కార్యక్రమం అత్యంత వైభవముగా నిర్వహించబడును. కావున భక్త మహాశయులు అందరూ ఇట్టి కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీ స్వామి వారి సేవలో పాల్గొని కృపకు పాత్రులు కాగలరని అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్ కుమార్, సిరికొండ నవీన్ కుమార్, కార్య నిర్వహణాధికారి కోరారు.







## సింగిల్ ఛార్జ్‌తో 100 కి.మీ రేంజ్

# ఈ ఎలక్ట్రిక్ స్కూటర్

# ధర రూ. 55వేల కన్నా తక్కువే!

**ఇదిగో కొమాకి ఎక్స్3 ఎలక్ట్రిక్ స్కూటర్..**

ఇండియాలో కొత్త కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్లు అందుబాటులోకి వస్తున్నాయి. వీటితో కస్టమర్స్‌కి మంచి ఆప్షన్స్ లభిస్తున్నాయి. మరి మీరు కూడా ఒక ఎలక్ట్రిక్ స్కూటర్ కొనాలని ప్లాన్ చేస్తున్నారా? అయితే మీరు కొమాకి ఎక్స్3 ఈస్కూటర్ గురించి తెలుసుకోవాల్సిందే. సింగిల్ ఛార్జ్‌తో 100 కి.మీ వరకు రేంజ్‌ని ఇచ్చే ఈ మోడల్ వివరాలను ఇక్కడ చూసేయండి..

**కొమాకి ఎక్స్3 ఎలక్ట్రిక్ స్కూటర్..**

కొమాకి ఎలక్ట్రిక్ వెహికల్ నుంచి ఎక్స్ 3 ఈస్కూటర్ ఇటీవలే మార్కెట్‌లో అడుగుపెట్టింది. ఈ ఎక్స్3 భారతదేశం అంతటా అధీకృత డీలర్‌షిప్స్‌లో, ఈకామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో లభిస్తుందని కోమాకి పేర్కొంది. కోమాకి ఎక్స్3 ఈస్కూటర్ ప్రాక్టికల్ డిజైన్‌తో వస్తుంది. ఇందులో డ్యూయెల్ ఎల్ఈడీ హెడ్ ల్యాంప్స్, ఎల్ఈడీ టర్న్ ఇండికేటర్లతో కూడిన ఫుల్ ఎల్ఈడీ లైటింగ్ సెటప్ ఇందులో అందించారు. కోమాకి ఎక్స్3 ఎలక్ట్రిక్ స్కూటర్‌లో డిజిటల్ డ్యాష్‌బోర్డ్, మల్టిపుల్ రైడింగ్ మోడ్స్, పార్కింగ్ రిపేర్ అసిస్ట్, రివర్స్ అసిస్ట్ వంటి ఫీచర్లు ఉన్నాయి. గార్నెట్ రెడ్, సిల్వర్ గ్రే, జెట్ బ్లాక్ కలర్ ఆప్షన్లలో లభిస్తుంది. కోమాకి ఎక్స్3లో లిథియంఅయాన్ బ్యాటరీ ప్యాక్ ఉంది. ఇది 3 కిలోవాట్ల ఎలక్ట్రిక్ మోటార్‌తో కనెక్ట్ చేసి ఉంటుంది. ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ ఫుల్ ఛార్జ్ చేస్తే 100 కిలోమీటర్ల వరకు రేంజ్‌ని ఇస్తుందని సంస్థ పేర్కొంది. అంతేకాకుండా గంటకు 55 కిలోమీటర్ల వేగంతో ఈ వెహికిల్ నడుస్తుందని సంస్థ స్పష్టం చేసింది.. "మహిళా రైడర్ల అవసరాలను తీర్చడానికి ఈ ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రత్యేకంగా రూపొందించాము. మా కొత్త ఎక్స్3 సిరీస్‌తో ఎలక్ట్రిక్ వాహనాల విప్లవానికి నాయకత్వం వహించడంలో మరొక మైలురాయిగా పరిగణించవచ్చు. మా వినియోగదారుల బేస్‌ని విస్తరించే దిశగా మేము పనిచేస్తున్నప్పుడు, మహిళా రైడర్ల అవసరాలను తీర్చడానికి ప్రత్యేకంగా కొత్త మోడల్ రూపొందించాము. ఈ ప్రక్రియలో, స్మార్ట్, గ్రీన్, మరింత ప్రాప్యత కలిగిన చలనశీలతను ప్రోత్సహించడం ద్వారా మొత్తం పర్యావరణ వ్యవస్థను పెంచే ఎలక్ట్రిక్ వాహనాలను సృష్టించే మా పెద్ద ఉద్దేశ్యంతో ఇది ప్రతిధ్వనిస్తుంది.

# ఎక్స్‌ను అమ్మేశా

## .. ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన



టెస్లా బాస్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ సంచలన ప్రకటన చేశారు. ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)ను విక్రయించినట్లు ప్రకటించారు. తన సొంత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ అయిన xAIకి 'ఎక్స్'ను 33 బిలియన్ల డాలర్లకు విక్రయించినట్లు వెల్లడించారు. ఈ విషయాన్ని మస్క్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ లావాదేవీ పూర్తిగా స్టాక్ రూపంలో జరిగిందని తెలిపారు. ఎక్స్ఏఐ విలువను 80 బిలియన్ డాలర్లుగా నిర్ధరించారు. 2022 అక్టోబర్‌లో ట్విటర్‌ను ఎలాన్ మస్క్ కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్ల చొప్పున 44 బిలియన్ డాలర్లు చెల్లించారు. ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను స్వాధీనం చేసుకున్న తర్వాత మస్క్ అనేక మార్పులు చేపట్టారు. సంస్థ పేరును ట్విటర్ నుంచి 'ఎక్స్'గా మార్చారు. అదేవిధంగా ట్విట్టర్ పిట్ట స్థానంలోకి 'X'ను చేర్చారు. దాదాపు 75 శాతం మంది ఉద్యోగులను తొలగించారు. కంటెంట్ విషయంలోనూ అనేక మార్పులు తీసుకొచ్చారు. ఇక చాట్‌జీపీటీకి పోటీగా గతేడాది మస్క్ 'ఎక్స్ఏఐ' పేరుతో అంకుర సంస్థను ప్రారంభించారు.

## ఫ్రీగా స్టూడియో జీబ్లీ స్టైల్ చిత్రాలను క్రియేట్ చేయాలా?..

# ఇలా చేయండి!







ఓపెన్ ఏఐ చాట్ జీపీటీ లో కొత్తగా అందుబాటులోకి వచ్చిన స్టూడియో జీబ్లీశైలి పోర్ట్రెయిట్ లను సృష్టించే ట్రెండ్ ఇప్పుడు ఆన్ లైన్ లో పాపులర్ అయింది. అయితే, ఈ ఫీచర్ చాట్ జీపీటీ ప్లస్, చాట్ జీపీటీ ప్రో, చాట్ జీపీటీ టీమ్ వినియోగదారులతో పాటు, ఎంపిక చేసిన సబ్ స్క్రైబర్లకు మాత్రమే ప్రత్యేకంగా అందుబాటులో ఉంది. అధిక డిమాండ్ కారణంగా ఉచిత వినియోగదారులకు ఈ ఫీచర్ ను అందుబాటులోకి తీసుకురాలేకపోయామని ఓపెన్ఏఐ సిఇఒ శామ్ ఆల్ట్‌మన్ పేర్కొన్నారు.

**ఇలా చేయండి..**

జీబ్లీ ఇమేజ్ ను క్రియేట్ చేయడానికి మీరు ఒక చిత్రాన్ని అప్ లోడ్ చేయాలి లేదా "పచ్చని అటవీ నేపథ్యం, మృదువైన రంగులతో స్టూడియో జీబ్లీ శైలిలో పోర్ట్రెయిట్ రూపొందించు" అనే స్పష్టమైన ప్రాంప్ట్ టైప్ చేయాలి. మిగిలిన పనిని AI చేస్తుంది. అయితే, ఈ టూల్స్ ఇప్పటికీ చాట్ జీపీటీ 4ఓ ప్లాట్ ఫామ్ ఇచ్చే సర్వీస్ తో సరిపోలకపోవచ్చు. అధిక నాణ్యత కోసం, రన్వే ఎంఎల్, లియోనార్డో ఏఐ లేదా Mage.space వంటి ప్లాట్ఫామ్ లను ఉపయోగించవచ్చు. ఆర్ట్ బ్రీడర్ అనేది చిత్రాలను మిళితం చేయడానికి, శైలులను మెరుగైన నియంత్రణతో మార్చడానికి ఉపయోగించే మరొక సాధనం, అయినప్పటికీ కొన్ని అప్ గ్రేడ్స్ పొందడానికి పెయిడ్ సర్వీస్ పొందాల్సి ఉంటుంది.



### సొంత టెలికాం టెక్నాలజీ ఉన్న టాప్-5 దేశాల్లో

# భారత్ ఒకటి

## కేంద్రమంత్రి సింధియా

సొంత టెలికాం టెక్నాలజీ కలిగిన దేశాల సరసన భారత్ చేరిందని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. భారత్ కన్నా ముందు చైనా, ఫిన్లాండ్, స్వీడన్, దక్షిణా కొరియా మాత్రమే ఈ టెక్నాలజీ ఉందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలికాం కంపెనీలు విలీనవుతున్నాయన్నారు. భారత్‌లో నాలుగు కంపెనీలు ఉన్నాయన్నారు. 2014లో 90కోట్ల మంది మొబైల్ కస్టమర్స్ ఉండగా.. నేడు ఈ సంఖ్య 1.2 మిలియన్లకుపైగా పెరిగిందన్నారు. అప్పుడు 25కోట్ల మంది ఇంటర్నెట్‌కు కనెక్ట్ అయ్యారని.. ప్రస్తుతం 97కోట్ల మంది ఇంటర్నెట్ యూజర్లు ఉన్నట్లు తెలిపారు. 2014లో ఆరు కోట్ల మందికి బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ ఉందని.. ఆ సంఖ్య నేడు 94 కోట్లకు చేరుకుందని.. ఇది అమెరికా మొత్తం జనాభా కంటే ఎక్కువ అని తెలిపారు.

## ఏటీఎం చార్జీల మోత

# మే 1 నుంచి లిమిట్ దాటితే వాత



**ముంబై :** నగదు అవసరం ఉన్నప్పుడల్లా కనిపించిన ఏటీఎంల్లోకి వెళ్లి కార్డులను ఎడాపెడా వాడేస్తున్నారా?.. అయితే ఇక మీదట జాగ్రత్తగా ఉండకపోతే మరింతగా నష్టపోవాల్సి వస్తుంది. అవును.. ఏటీఎం చార్జీలను పెంచుకొనేందుకు బ్యాంకులకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) శుక్రవారం అనుమతి ఇచ్చింది మరి. ప్రతి నెలా ఉచిత నగదు ఉపసంహరణలకున్న పరిమితి దాటితే ఒక్కో నగదు ఉపసంహరణకు రూ.23 చార్జీ పడనున్నది. మే 1 నుంచి ఈ కొత్త చార్జీలు అమల్లోకి రానున్నాయి. ఇప్పుడు ఈ చార్జీ రూ.21గా ఉన్నది. కానీ దీనికి అదనంగా మరో రూ.2 పెంచుకోవచ్చని బ్యాంకులకు ఆర్బీఐ ఓ సర్క్యులర్‌లో స్పష్టం చేసింది.

**ఇదీ సంగతి..**

బ్యాంక్ ఖాతాదారులు ప్రతి నెలా తమకు ఖాతా ఉన్న బ్యాంక్ ఏటీఎంల్లో ఐదుసార్లు ఆర్థిక, ఆర్థికేతర లావాదేవీలను ఉచితంగానే జరుపుకోవచ్చు. అలాగే ఇతర బ్యాంక్ ఏటీఎంల్లో మూడుసార్లు (హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో) ఈ లావాదేవీలను ఉచితంగా చేసుకోవచ్చు. నాన్ మెట్రో నగరాల్లోనైతే ఐదుసార్లు ఫ్రీ. అయితే ఈ పరిమితులు దాటితే రూ.21 చార్జీ వేస్తున్నారు.




# దేశం-విదేశం

NATIONAL-INTERNATIONAL



# 16 ఏళ్ల నిరీక్షణ..

## నిర్దోషిగా హైకోర్టు మాజీ జడ్జి



**చండీగడ్:** అదొక పదహారేళ్ల క్రితం కేసు.. అందులోనూ హైప్రొఫైల్ కేసు. ఒక జస్టిస్ తనను తాను నిర్దోషిగా నిరూపించుకోవడానికి సుదీర్ఘకాలం వేచి చూసిన కేసు. హర్యానా జడ్జిగా పని చేసిన జస్టిస్ నిర్మలా యాదవ్.. భారీగా అక్రమాలకు పాల్పడ్డారనే కేసు. అయితే ఆ కేసు సుదీర్ఘంగా విచారణ చేసింది సీబీఐ. చివరకు ఆ కేసులో నిర్మలా యాదవ్ ఎటువంటి తప్పుచేయలేదని తేలడంతో ఆమెకు బిగ్ రిలీఫ్ లభించింది. తాజాగా సీబీఐ కోర్టు.. ఆమెను నిర్దోషిగా తేల్చి తీర్పును వెలువరించింది. 2008 జరిగిన ఈ కేసులో తీర్పు తనకు అనుకూలంగా రావడంతో జస్టిస్ నిర్మలా యాదవ్ సంతోషం వ్యక్తం చేశారు. విచారణలో భాగంగా ఈరోజు (శనివారం) సీబీఐ కోర్టుకు హాజరైన ఆమె.. తీర్పు తర్వాత మాట్లాడారు. తనకు న్యాయ వ్యవస్థ మీద నమ్మకం ఉందని, అందుకే ఇంతకాలం ఓపిక పట్టిన దానికి ప్రతిఫలం లభించిందన్నారు.

**ఒక జడ్జికి ఇవ్వబోయి.. మరొక జడ్జికి క్యాష్ డెలివరీ**

ఆ ఇదర్దు జడ్జి పేర్లు ఇంచుమించు ఒకే మాదిరి ఉంటాయి. ఒకరు నిర్మలా యాదవ్ అయితే మరొకకే నిర్మలాజిత్ కౌర్. అయితే హర్యానా మాజీ అదనపు అడ్వకేట్ జనరల్ సంజీవ్ బన్సాల్ క్లర్క్.. ఓ రూ. 15 లక్షల నగదును ప్యాక్ చేసుకుని నిర్మలా యాదవ్ ఇంటికి వెళ్లినట్లు విచారణలో తేలింది. తాను ఇవ్వాల్సింది జస్టిస్ నిర్మలాజిత్ కౌర్ కని కాకపోతే పొరపాటున జస్టిస్ నిర్మలా యాదవ్ ఇంటికి వెళ్లినట్లు తెలిపాడు ఆ ప్యాక్ తీసుకెళ్లిన అప్పటి క్లర్క్.

**రోజుల వ్యవధిలో ఆమెపై రెండు ఎఫ్ఐఆర్‌లు**

ఈ కేసుకు సంబంధించి 2008, ఆగస్టు 16వ తేదీన ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఆ తర్వాత మళ్లీ ఓ కీలక మలుపు తీసుకుంది. అప్పటి యూనియన్ టెర్రిటరీ జనరల్ ఎస్ఎఫ్ రోడ్రిగ్స్ ఆదేశాలతో ఆ కేసును సీబీఐకి బదిలీ చేశారు. దాంతో 12 రోజుల వ్యవధిలో సీబీఐ మరొక ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.


## 2009 జనవరిలో సీబీఐ విచారణ ప్రారంభం

జస్టిస్ నిర్మలా యాదవ్ పై వచ్చిన అవినీతి ఆరోపణల్లో దర్యాప్తు చేపట్టేందుకు తమకు అనుమతి కావాలంటూ పంజాబ్, హర్యానా హైకోర్టుకు తెలియచేసింది సీబీఐ. దీనికి అనుమతి లభించడంతో జస్టిస్ నిర్మలా యాదవ్ పై విచారణ చేపట్టింది సీబీఐ. 2011లో ఆమెపై చార్జిషీట్ నమోదు చేసింది సీబీఐ. దీనిలో భాగంగా మొత్తం 84 మంది సాక్షులను పేర్లను నమోదు చేసింది. ఇందులో 69 మందిని విచారించిన సీబీఐ.. ఈ ఏడాది ఫిబ్రవరిలో 10 మంది సాక్షులను తిరిగి విచారించడానికి హైకోర్టు అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలోనే 10 మంది కీలక సాక్షులను మళ్లీ విచారించారు. చివరకు ఆ రూ. 15 లక్షల కేసులో జస్టిల్ నిర్మలా యాదవ్ పాత్ర ఏమీ లేదని తేలడంతో ఆమె నిర్దోషిగా నిరూపితమయ్యారు.

## రైల్వే టికెట్ కౌంటర్‌లో కొన్నా..

# ఆన్‌లైన్‌లో క్యాన్సిల్ చేసుకోవచ్చు

రైల్వే టికెట్లను.. రైల్వే కౌంటర్లలో కొనుగోలు చేస్తే ఆన్‌లైన్‌లో IRCTC వెబ్‌సైట్ ద్వారా లేదా 139కి కాల్ చేసి రద్దు చేసుకోవచ్చు. అయితే టికెట్స్ క్యాన్సిల్ చేసుకున్న తరువాత రీఫండ్ కోసం రిజర్వేషన్ కేంద్రానికి వెళ్లాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ కొత్త చొరవ వల్ల ప్రయాణికులు తమ టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి ప్రత్యేకించి స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇది లక్షలాది మంది రైలు ప్రయాణికుల సమయాన్ని ఆదా చేస్తుందని అన్నారు. ఈటిక్కెట్లకు బదులుగా కౌంటర్ల నుంచి వెయిటింగ్ టిక్కెట్లు కొనుగోలు చేసిన ప్రయాణీకులు రైలు బయలుదేరే ముందు స్టేషన్‌కు వెళ్లి టిక్కెట్లను రద్దు చేసుకోవాలా?.. అని బీజేపీ ఎంపీ మేధా విశ్రామ్ కులకర్ణి అడిగిన ప్రశ్నకు అశ్విని వైష్ణవ్ పై విధంగా సమాధానం ఇచ్చారు. గతంలో ప్రయాణికులు టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి, డబ్బు వాపసు తీసుకోవడానికి రైల్వే కౌంటర్లకు తిరిగి వెళ్లాల్సి వచ్చేది. దీనికోసం ప్రయాణికులు సమయాన్ని వృధా చేయాల్సి వచ్చేది. కొత్త ఆన్‌లైన్ టిక్కెట్ రద్దు వ్యవస్థ భారతీయ రైల్వే వెబ్‌సైట్ లేదా మొబైల్ యాప్ ద్వారా టిక్కెట్లను రద్దు చేసుకోవడానికి వీలు కల్పిస్తుంది. ఈ ప్రక్రియను చాలా సౌకర్యవంతంగా ఉంటుంది.








# ప్రయాగ్‌రాజ్‌కు పోటీగా నాసిక్ కుంభమేళా

నాసిక్: ఇటీవలే యూపీలోని ప్రయాగ్‌రాజ్ లో అత్యంత వైభవంగా మహాకుంభమేళా జరిగింది. ఇప్పుడు దీనికి పోటీనిచ్చే రీతిలో మహారాష్ట్రలోని నాసిక్‌లో కుంభమేళా జరగనుంది. దీనికి త్రయంబకేశ్వర్‌నాసిక్ సింహస్థ కుంభమేళాగా నామకరణం చేయనున్నారని తెలుస్తోంది. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నాసిక్‌లో పర్యటించిన తరువాత 2027లో నాసిక్‌లో జరగబోయే కుంభమేళాకు సన్నాహాలు ఊపందుకున్నాయి. అయితే ఈ మేళాకు తగిన పేరు పెట్టే విషయంలో భిన్నాభిప్రాయాలు నెలకొన్నాయి. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా త్రయంబకేశ్వర్ అఖాఢాల ప్రతినిధులు ఈ ఉత్సవానికి త్రయంబకేశ్వర్‌నాసిక్ సింహస్థ కుంభమేళా అనే పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. ఇటీవల నాసిక్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో నాసిక్ అఖాఢాల నేతలు ఈ కుంభమేళా పేరును నాసిక్ కుంభమేళాగానే కొనసాగించాలని కోరారు. నాసిక్ అఖాడాల సాధువులు సింహస్థ కుంభమేళా అథారిటీలో తమను భాగస్వాములను చేయాలని, కుంభమేళా నిర్వహణకు 500 ఎకరాలకు పైగా భూమిని శాశ్వతంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. నాసిక్ జిల్లా మేజిస్ట్రేట్ జలజ్ శర్మ మాట్లాడుతూ నాసిక్ కుంభమేళా పేరుకు సంబంధించిన సమాచారాన్ని ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు. రికార్డులను తనిఖీ తర్వాత ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్ణయం తీసుకుంటామన్నారు. నాసిక్‌లో 2027 జూలై 14 సెప్టెంబర్ 25 మధ్య గోదావరి నది ఒడ్డున జరగనుంది. ఇది 12 సంవత్సరాల తర్వాత జరుగుతోంది. ఇటీవల మహారాష్ట్ర జలవనరులు, విపత్తు నిర్వహణ మంత్రి గిరీష్ మహాజన్ కుంభమేళా ఏర్పాట్లను సమీక్షించేందుకు త్రయంబకేశ్వర్‌ను సందర్శించారు. సాధువులు, మహంతుల డిమాండ్లపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహాకుంభమేళాకు ధీటుగా నాసిక్ కుంభమేళాను నిర్వహించాలని మహారాష్ట్ర సర్కారు యోచిస్తోంది.

# ప్రాణాల కోసం పరుగులు తీశాం..

## బ్యాంకాక్ భూకంపంపై భారతీయ టూరిస్టులు



మయన్మార్, థాయిలాండ్‌లలో సంభవించిన భూకంపం వందలాదిమందిని పొట్టనపెట్టుకుంది. భూకంపం సంభవించిన సమయంలో భవనాలు ఊగిపోతూ నేలకొరిగాయి. కొన్ని భవనాలపైనుంచి నీరు బయటకు దారాపాతంగా పొంగుకొచ్చింది. ఈ పరస్థితులను చూసిన జనం వణికిపోతూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రోడ్లపైకి పరుగులు తీశారు. మయన్మార్)లో 7.2 తీవ్రతతో భూకంపం సంభవించగా దాని ప్రకంపనలు థాయ్‌లాండ్‌ను కుదిపివేశాయి. ఆ సమయంలో అక్కడ ఉన్న భారత్‌కు చెందిన పర్యాటకులు వెనువెంటనే విమానాల్లో భారత్‌కు తిరిగి వచ్చారు. వీరు తమ అనుభవాలను మీడియాతో పంచుకున్నారు. థాయ్‌లాండ్ నుంచి కోల్‌కతా విమానాశ్రయానికి చేరుకున్న రంజన్ బెనర్జీ మాట్లాడుతూ.. భూకంపం సంభవించినప్పుడు వెంటనే మాల్స్‌తోపాటు పలు కార్యాలయాలను ఖాళీ చేయించారు. మెట్రో రైలు రాకపోకలను నిలిపివేశారని తెలిపారు. మరో పర్యాటకుడు సఫ్దర్ మాట్లాడుతూ, ఆకాశహర్మ్యాలు వణికిపోయాయని, భవనాల పైనుంచి జలపాతంలా నీరు కిందికి పడిందని తెలిపారు. సంజీవ్ దత్తా మాట్లాడుతూ.. తాను పడుకున్న మంచం ఒక్కసారిగా కదిలిపోయిందన్నారు. జనం భయంలో రోడ్లపై పరిగెట్టారని, తాను ఏడవ అంతస్తు నుండి గ్రౌండ్ ఫ్లోర్‌కు వచ్చి, అక్కడ కొంతసేపు వేచి ఉన్నానని, భారీ ట్రాఫిక్ కారణంగా 30 కిలోమీటర్లు ప్రయాణించడానికి ఐదారు గంటలు పట్టిందని ఏఎన్ఐకి తెలిపారు. అత్యవసరంగా విమానాశ్రయానికి చేరుకునేందుకు టాక్సీలు దొరకలేదని భారతి ఖురానా చెప్పారు. తాము ఉన్న హోటల్ తీవ్రంగా కంపించడంతో అందరూ బయటకు పరుగులు తీసిన విషయాన్ని ప్రణవ్ గుర్తు చేసుకున్నారు. థాయిలాండ్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తోందని సంబంధిత అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో థాయిలాండ్‌లోని భారతీయ పౌరులు నంబర్ +66 618819218ను సంప్రదించాలని సూచించారు. బ్యాంకాక్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులు, సిబ్బంది చియాంగ్ మాయిలోని కాన్సులేట్ సభ్యులంతా సురక్షితంగా ఉన్నారని థాయిలాండ్‌లోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా ప్లాట్‌ఫారం ఎక్స్‌లో తెలిపింది.

### వివాదంలో మోహన్‌లాల్ 'ఎల్ 2 ఎంపురాన్'

# హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించిన ఆర్ఎస్ఎస్..!



స్టార్ నటుడు మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ఎల్ 2 ఎంపురాన్' చిత్రం వివాదంలో చిక్కుకున్నది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఈ మూవీని హిందూ వ్యతిరేక చిత్రంగా అభివర్ణించింది. కాంగ్రెస్ ఈ చిత్రానికి మద్దతు ప్రకటించగా.. బీజేపీ మాత్రం మిన్నకుండిపోయింది. ఎంపురాన్ చిత్రం ఈ నెల 27న విడుదలైన విషయం తెలిసిందే. ఈ మూవీకి ప్రేక్షకుల నుంచి స్పందన వస్తున్నది. మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన ఎల్ 2 ఎంపురాన్‌పై ఆర్ఎస్ఎస్ తీవ్రంగా విమర్శలు గుప్పించింది. ఆర్ఎస్ఎస్ మౌత్ పీస్ ఆర్గనైజర్‌లో ప్రచురించిన కథనం ప్రకారం.. ఈ చిత్రం 2002 గోద్రా అల్లర్ల నేపథ్యాన్ని ఉపయోగించి హిందూ వ్యతిరేక రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకువస్తుందని ఆరోపించింది. ఈ మూవీ స్టోరీ హిందువులను కించపరచడమే కాకుండా.. ప్రత్యేకంగా హిందూ అనుకూల రాజకీయ భావజాలలను లక్ష్యంగా చేసుకుంటుందని విమర్శించింది. ఈ సినిమా హిందూ వ్యతిరేక, బీజేపీ వ్యతిరేక కథనాన్ని వ్యాప్తి చేయడానికి ఒక మాధ్యమమని.. వాస్తవాలను ఉద్దేశపూర్వకంగా వక్రీకరించారంటూ మండిపడింది. భారతదేశంతో సహా ఉపఖండంలో జరుగుతున్న మారణహోమం మధ్య హిందువులను విలన్లుగా చిత్రీకరించే హిందూ వ్యతిరేక ప్రచార చిత్రం ఎంపురాన్ అంటూ మండిపడింది. బీజేపీ కేరళ ప్రధాన కార్యదర్శి పీ సుధీర్ మాట్లాడుతూ ఈ మూవీ తన దారిలో వెళ్తుందని.. పార్టీ సైతం తన పని తాను చేసుకుంటుందన్నారు. ఈ సినిమాతోనూ పార్టీ ప్రభావితం కాదని.. సంఘ్‌కు తమ అభిప్రాయాలను వ్యక్త పరిచే హక్కు ఉందని.. అది మంచి చిత్రమా? లేదా? అన్నది నిర్ణయించుకునే హక్కు ప్రేక్షకులకు ఉందని పేర్కొంది. కేరళ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు, పాలక్కాడ్ ఎమ్మెల్యే రాహుల్ మమ్‌కుట్టతిల్ మూవీకి మద్దతు ప్రకటించారు. కశ్మీర్ ఫైల్స్, కేరళ స్టోరీ వంటి నిరాధారమైన అబద్ధాలు, మత పరమైన ద్వేషాలతో కూడిన చిత్రాలకు భావ ప్రకటనా స్వేచ్ఛను సమర్థించే వ్యక్తులు ఇప్పుడు ఎంపురాన్‌ను వ్యతిరేకిస్తున్నారని మండిపడ్డారు. మూవీని నిర్మించిన నిర్మాత పురస్కారానికి అర్హుడని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి దివంగత కొడియేరి బాలకృష్ణన్ కుమారుడు, నటుడు బినీష్ కొడియేరి పేర్కొన్నారు.

## మయన్మార్‌లో మరోసారి కంపించిన భూమి



**వరుస భూకంపాలతో మయన్మార్ వణికిపోతున్నది. శుక్రవారం మధ్యాహ్నం 12 నిమిషాల వ్యవధిలో 7.7, 6.4 తీవ్రతతో రెండుసార్లు భూకంపం వచ్చిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా స్వల్ప స్థాయిలో ప్రకంపనలు నమోదయ్యాయి. తాజాగా ఇవాళ మరోసారి అక్కడ భూ ప్రకంపనలు నమోదయ్యాయి. శనివారం మధ్యాహ్నం 2:50 గంటల సమయంలో (భారత కాలమానం ప్రకారం) 4.7 తీవ్రతతో భూమి కంపించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది.**




### ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరిన బాలుడు..

# తర్వాత ఏం జరిగిందంటే?


**చండీగఢ్:** పార్కులో ఆడుకుంటున్న బాలుడు తుంటరి పని చేశాడు. తాడుతో కట్టిన ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరాడు. అయితే పైనున్న హై వోల్టేజీ విద్యుత్ వైరుకు అది తగిలింది. దీంతో పెద్ద శబ్దంతోపాటు మంటలు వ్యాపించాయి. ఆ బాలుడికి తీవ్ర కాలిన గాయాలయ్యాయి. ఇది చూసి అక్కడున్న వ్యక్తులు షాక్ అయ్యారు. భయంతో పరుగులు తీశారు. పంజాబ్‌లోని జలంధర్‌లో ఈ సంఘటన జరిగింది. 9 ఏళ్ల ఆరవ్ మూడో తరగతి చదువుతున్నాడు. సాయంత్రం వేళ పార్కులో ఆడుకున్నాడు. ఈ సందర్భంగా తాడుతో కట్టిన ప్లాస్టిక్ వస్తువును గాలిలోకి విసిరాడు. కాగా, పార్క్ పైనుంచి వెళ్తున్న 66 కేవీ హైవోల్టేజీ విద్యుత్ లైన్‌కు ఆ ప్లాస్టిక్ వస్తువు తగిలింది. దీంతో పేలుడు వంటి శబ్దం రావడంతోపాటు తాడు పట్టుకున్న బాలుడికి మంటలు వ్యాపించాయి. ఈ నేపథ్యంలో షాక్‌తో కిందపడిపోయాడు. మరోవైపు ఇది చూసి అక్కడున్న వారు భయాందోళన చెందారు. భయంతో దూరంగా పారిపోయారు. ఆ తర్వాత ఆ బాలుడి వద్దకు కొందరు చేరుకున్నారు. తీవ్ర కాలిన గాయాలైన ఆరవ్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ బాలుడి పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అమృత్‌సర్‌లోని హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. అయితే ఆ ప్రాంతంలోని సీసీటీవీలో రికార్డైన షాకింగ్ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## సైబర్ మోసంలో 50 లక్షలు పోగొట్టుకున్న వృద్ధ దంపతులు.. ఆత్మహత్య



బెంగళూరు: వృద్ధ దంపతులు సైబర్ మోసానికి గురయ్యారు. రూ.50 లక్షలు పోగొట్టుకున్నారు. సంతానం లేకపోవడంతో ఎవరిపై ఆధారపడటం ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. జరిగిన సైబర్ మోసం గురించి సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. కర్ణాటకలోని బెళగావి జిల్లాలో ఈ విషాద సంఘటన జరిగింది. 82 ఏళ్ల డియోగ్జెరోన్ శాంతన్ నజరెత్, 79 ఏళ్ల ఫ్లావియానా వృద్ధ దంపతులు. ఖానాపూర్‌లోని బీడీ గ్రామంలో వారు నివసిస్తున్నారు. మార్చి 27న ఫ్లావియానా బెడ్‌పై మరణించి ఉండటాన్ని పొరుగువారు గమనించారు. రిటైర్డ్ మహారాష్ట్ర ప్రభుత్వ సెక్రెటేరియట్ ఉద్యోగి అయిన డియోగ్జెరోన్ శాంతన్ మృతదేహాన్ని ఆ ఇంటి అండర్ గ్రౌండ్ నీటి ట్యాంక్‌లో గుర్తించారు. ఆయన మెడ, చేతి మణికట్టుపై కత్తి గాయాలున్నాయి. కాగా, ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. డియోగ్జెరోన్ శాంతన్ రాసిన సూసైడ్ నోట్‌ను పరిశీలించారు. సుమిత్ బిర్రా, అనిల్ యాదవ్ పేర్లను ఆ నోట్‌లో ఆయన పేర్కొన్నారు. అందులోని వివరాల ప్రకారం.. ఢిల్లీకి చెందిన టెలికాం డిపార్ట్‌మెంట్ అధికారిగా చెప్పుకున్న సుమిత్ బిర్రా అనే వ్యక్తి డియోగ్జెరోన్‌కు ఫోన్ చేశాడు. ఆయన పేరు మీద మోసపూరితంగా సిమ్ కార్డు కొనుగోలు చేసినట్లు తెలిపాడు. వేధింపులు, అక్రమ ప్రకటనలకు ఆ సిమ్ కార్డును వినియోగిస్తున్నట్లు ఆరోపించాడు. ఆ తర్వాత క్రైమ్ బ్రాంచ్‌కు చెందిన అనిల్ యాదవ్ వ్యక్తికి ఫోన్ కాల్‌ను ట్రాన్స్‌ఫర్ చేశాడు. సిమ్ కార్డ్ దుర్వినియోగంపై చట్టపరమైన పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని డియోగ్జెరోన్ శాంతన్‌ను అతడు బెదిరించాడు. ఆయన ఆస్తి, ఆర్థిక వివరాలను అడిగి తెలుసుకున్నాడు. భయపెట్టి, వేధించి రూ. 50 లక్షలకు పైగా వసూలు చేశారు. మరోవైపు సైబర్ నేరగాళ్లు తమను మరింతగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని డియోగ్జెరోన్ శాంతన్ ఆ సూసైడ్ నోట్‌లో ఆరోపించారు.

# నేపాల్‌లో హింస.. 100 మంది అరెస్ట్



హిమాలయ దేశం నేపాల్ లో తిరిగి రాచరికాన్ని ప్రవేశపెట్టాలనే డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. దీంతో అక్కడ గత కొంతకాలంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. దేశంలోని ప్రజలు రాచరిక పాలన కోరుతూ మాజీ రాజు జ్ఞానేంద్ర షా మద్దతుదారులు రోడ్లపైకి వచ్చి పెద్ద ఎత్తున నిరసన చేపడుతున్నారు. ఈ సందర్భంగా తాజాగా అక్కడ హింస చోటు చేసుకుంది. నేపాల్ రాజధాని ఖాట్మాండూ లోని కొన్ని ప్రాంతాల్లో రాచరిక అనుకూల నిరసనకారులు రెచ్చిపోయారు. ఒక రాజకీయ పార్టీ కార్యాలయంపై దాడి చేశారు. ఓ టెలివిజన్ ఆఫీసును, పత్రికా కార్యాలయాన్ని ధ్వంసం చేశారు. రాళ్లు రువ్వడంతోపాటు, వాహనాలకు నిప్పంటించారు, దుకాణాలను దోచుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. దీంతో సైన్యం రంగప్రవేశం చేసి నిరసనకారులను అడ్డుకుంది. ఈ ఘర్షణల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 112 మంది గాయపడ్డారు. రంగంలోకి దిగిన పోలీసులు సుమారు 100 మంది నిరసనకారులను అరెస్ట్ చేశారు. కాగా, నేపాల్‌లో రాచరికం 2008లో అంతమైంది. ఫిబ్రవరి 19న ప్రజాస్వామ్య దినోత్సవం సందర్భంగా మాజీరాజు జ్ఞానేంద్ర తనకు మద్దతు ఇవ్వాల్సిందిగా ప్రజలకు పిలుపునిస్తూ వీడియో జారీ చేసినప్పటి నుంచి రాచరిక అనుకూల ఉద్యమం రాజుకుంది. దీని తరువాత దేశంలో ఆందోళనలు చెలరేగాయి.

## క్రీడా వార్తలు | SPORTS NEWS



# అదరగొట్టిన గుజరాత్ టైటాన్స్

ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. ఆల్ రౌండ్ పర్ ఫార్మెన్స్ తో శనివారం (మార్చి 29) ముంబయి ఇండియన్స్ ను చిత్తుచేసింది. అహ్మదాబాద్ లో జరిగిన మ్యాచ్ లో గుజరాత్ 36 పరుగుల తేడాతో గెలిచింది. ఛేజింగ్ లో ముంబయి 6 వికెట్లకు 160 పరుగులు చేసింది. సిరాజ్ (2/34), ప్రసిద్ధ్ కృష్ణ (2/18) ముంబయిని దెబ్బకొట్టారు. సూర్యకుమార్ (28 బంతుల్లో 48) టాప్ స్కోరర్.

ఫస్ట్ బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. సుదర్శన్ 41 బాల్స్ లో 63 రన్స్ చేశాడు. హార్దిక్ పాండ్య 2 వికెట్లు పడగొట్టాడు. తన తొలి మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ చేతిలో పోరాడి ఓడిన గుజరాత్ ఈ సారి మాత్రం వదల్లేదు. మరోవైపు అయిదు సార్లు ఛాంపియన్ ముంబయి వరుసగా రెండో మ్యాచ్ లోనూ ఓడింది.

### సిరాజ్ దెబ్బ

గుజరాత్ టైటాన్స్ తో ఐపీఎల్ 2025 మ్యాచ్ ఛేజింగ్ లో ముంబయి ఇండియన్స్ ను సిరాజ్ వణికించాడు. సన్సేషనల్ బౌలింగ్ తో సత్తాచాటాడు. గుజరాత్ బౌలింగ్ ఎటాక్ ను స్టార్ట్ చేసిన సిరాజ్.. ఫస్ట్ ఓవర్లోనే రోహిత్ (8)ను బౌల్డ్ చేశాడు. వరుసగా రెండు ఫోర్లు కొట్టిన రోహిత్.. ఆ వెంటనే సర్రుమంటూ లోపలకు దూసుకొచ్చిన బంతికి ఏం చేయలేకపోయాడు. ప్యాడ్, బ్యాట్ మధ్యలో నుంచి వెళ్లిన ఆ బాల్ స్టంప్స్ ను లేపేసింది. ఇన్నింగ్స్ అయిదో ఓవర్లో రికిల్టన్ (6) ఆఫ్ స్టంప్ నూ సిరాజ్ లేపేశాడు.

### తిలక్, సూర్య జోడీ

పవర్ ప్లేలోనే ఓపెనర్ల వికెట్లను కోల్పోయిన ముంబయిని తెలుగు ఆటగాడు తిలక్ వర్మ (36 బంతుల్లో 39), సూర్యకుమార్ కలిసి ఆదుకునేందుకు ట్రై చేశారు. డేంజరస్ రబాడ బౌలింగ్లో వరుసగా 4, 4, 6 కొట్టిన తిలక్.. ఆ తర్వాత స్లో అయ్యాడు. 7 ఓవర్లకు స్కోరు 54/2. కానీ ఇంపాక్ట్ ప్లేయర్ గా వచ్చిన వెటరన్ పేసర్ ఇషాంత్ శర్మ వేసిన 8వ ఓవర్లో తిలక్ ఫోర్, సూర్య సిక్సర్ కొట్టాడు.

### తిప్పేసిన ప్రసిద్ధ్

లేట్ గా 12వ ఓవర్లో బౌలింగ్ కు వచ్చిన ప్రసిద్ధ్ కృష్ణ అద్భుత బౌలింగ్ తో మ్యాచ్ ను మలుపు తిప్పాడు. తిలక్, సూర్యకుమార్ వికెట్లను పడగొట్టాడు. మొదట తిలక్ ను ఔట్ చేశాడు. ప్రసిద్ధ్ బౌన్సర్ బలంగా హెల్మెట్ కు తగలడంతో కింద పడిపోయిన సూర్య.. కాసేపటి తర్వాత బ్యాటింగ్ కొనసాగించాడు. ముంబయి విజయానికి 30 బాల్స్ లో 79 రన్స్ కావాలిన దశలో 16వ ఓవర్ ను ప్రసిద్ధ్ వేసిన తీరు అమేజింగ్ అంతే. 2 రన్స్ మాత్రమే ఇచ్చిన అతను.. సూర్యను పెవిలియన్ చేర్చి కీ వికెట్ సాధించాడు. ఆ తర్వాతి ఓవర్లోనే హార్దిక్ పాండ్య (11)ను రబాడ ఔట్ చేయడంతో ముంబయి పనైపోయింది.

### పునాది బలంగా

టాస్ ఓడి బ్యాటింగ్ కు దిగిన గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరుకు బలమైన పునాది వేసుకుంది. ఓపెనర్లు శుభ్‌మన్ గిల్ (27 బంతుల్లో 38), సాయి సుదర్శన్ సత్తాచాటారు. పవర్ ప్లేలో ముంబయి 66/0తో నిలిచింది. పవర్ ప్లే ముగిశాక స్వయంగా బౌలింగ్ కు దిగిన కెప్టెన్ హార్దిక్ పాండ్య షార్ట్ బాల్ తో శుభ్‌మన్ ను ఔట్ చేశాడు.

### బౌండరీల వేట


**గుజరాత్ ఇన్నింగ్స్ మధ్యలో కాస్త స్లో అయినా.. అప్పటికే క్రీజులో కుదురుకున్న సుదర్శన్ తో కలిసి బట్లర్ (24 బంతుల్లో 39) బౌండరీల వేటలో సాగాడు. తెలుగు పేసర్ సత్యనారాయణ ఓవర్లో బట్లర్, సుదర్శన్ చెరో ఫోర్ కొట్టారు. కానీ ప్రమాదకర బట్లర్ ను ఔట్ సైడ్ ఆఫ్ స్టంప్ బాల్ తో ముజీబ్ బుట్టలో వేసుకున్నాడు. సుదర్శన్ ను ఎల్బీగా ఔట్ చేసిన బౌల్ట్.. కీలక సమయంలో వికెట్ సంపాదించాడు. దీపక్ చాహర్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్లో రెండు బంతుల్లో రెండు వికెట్లు పడ్డాయి. లాస్ట్ ఓవర్ వేసిన సత్యనారాయణ ఓ సిక్సర్ ఇచ్చినా వెంటనే రషీద్ ఖాన్ (6)ను ఔట్ చేసి ఫస్ట్ ఐపీఎల్ వికెట్ సాధించాడు.**

# కివీస్‌దే తొలి వన్డే



నేపియర్(న్యూజిలాండ్): ఇప్పటికే టీ20 సిరీస్ కోల్పోయిన పాక్.. మూడు వన్డేల సిరీస్‌లో శుభారంభం చేయలేకపోయింది. శనివారం జరిగిన తొలి వన్డేలో కివీస్ 73 పరుగుల తేడాతో పాక్‌పై ఘన విజయం సాధించింది. తొలుత కివీస్..మార్క్‌చాప్‌మన్(132) సెంచరీకి తోడు మిచెల్(76), అబ్బాస్(52) అర్ధసెంచరీలతో నిర్ణీత 50 ఓవర్లలో 344/9 స్కోరు చేసింది. ఇర్ఫాన్‌ఖాన్(3/51), రవూఫ్(2/38), జావెద్(2/55) ఆకట్టుకున్నారు. ఆ తర్వాత ఛేదనకు దిగిన పాక్ 44.1 ఓవర్లలో 271 పరుగులకు ఆలౌటైంది. బాబర్ ఆజమ్(78), సల్మాన్ ఆగా(58) అర్ధసెంచరీలతో రాణించారు. నాథన్ స్మిత్(4/60) నాలుగు వికెట్లు పడగొట్టాడు.

# భారత రెజ్లర్లకు నిరాశ



అమ్మాన్(జోర్డాన్): ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఫ్రీస్టయిల్ రెజ్లర్లకు తీవ్ర నిరాశ ఎదురైంది. శనివారం జరిగిన పురుషుల 65కిలోల విభాగంలో బరిలోకి దిగిన సుజిత్ కల్కాల్..పాలస్తీనా రెజ్లర్ అబ్దుల్లా అసఫ్‌పై గెలిచినా..కైజీ తనాబే(జపాన్) చేతిలో ఎదుర్కొవాల్సి వచ్చింది. తనాబే ఫైనల్ చేరినా గాయం కారణంగా సుజిత్ రెపిచేజ్‌లో ఆడే అవకాశాన్ని చేజార్చుకున్నాడు. మిగతా విభాగాల్లో విశాల్ కాళీ రామన్(65కి), చిరాగ్(57కి), చంద్రమోహన్(79కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓటములు ఎదుర్కొన్నారు.

# నేపాల్ కోచ్‌గా వరల్డ్ కప్ హీరో.. పసికూన రాత మారుస్తాడా..?



నేపాల్ క్రికెట్ బోర్డు పురుషుల జట్టుకు కొత్త హెడ్‌కోచ్‌ను నియమించింది. సుదీర్ఘ అనుభవజ్ఞుడైన స్టువార్ట్ లా ను ప్రధాన కోచ్‌గా ఎంపిక చేసింది. ఆస్ట్రేలియా మాజీ ఆటగాడైన స్టువార్ట్ త్వరలోనే బాధ్యతలు చేపట్టనున్నాడు. ఈ ఆసీస్ మాజీ ఆటగాడు రెండేళ్ల పాటు సేవలందించనున్నాడు. ఇంతకుముందు కోచ్‌గా పని చేసిన మాంటీ దేశాయ్ పదవీకాలం ఫిబ్రవరిలో ముగిసింది. జూన్‌లో వరల్డ్ కప్ లీగ్ 2 మ్యాచ్‌లు ఉన్నాయి. దాంతో, కొత్త కోచ్ ఎంపిక అనివార్యమైంది. ఈ క్రమంలోనే గతంలో వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, అఫ్గనిస్థాన్.. వంటి జట్లకు కోచ్‌గా పనిచేసిన స్టువార్ట్‌ను నేపాల్ క్రికెట్ పెద్దలు సంప్రదించారు. తర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా ముద్ర పడిన తమ టీమ్ రాత మార్చేందుకు అతడిని ఏరికోరి మరీ కోచ్‌గా నియమించింది నేపాల్ బోర్డు.

ఆస్ట్రేలియా తరఫున 54 వన్డేలు, ఒకే ఒక టెస్టు ఆడిన స్టువార్ట్.. 1966 వరల్డ్ కప్ రన్నరప్ జట్టులో సభ్యుడు. వీడ్కోలు తర్వాత కోచ్‌గా అవతారమెత్తిన అతడు.. నిరుడు అమెరికా జట్టు టీ20 వరల్డ్ కప్‌లో సంచలన విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అందుకే తమ జట్టును గాడీలో పెట్టేందుకు.. మళ్లీ విజయాల బాట పట్టించేందుకు ఈ ఆసీస్ మాజీనే సరైనోడు అని భావించింది నేపాల్ బోర్డు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా అతడిని హెడ్‌కోచ్‌గా ప్రకటించింది.

### జూన్‌లో ముక్కోణపు సిరీస్

అంతర్జాతీయ స్థాయిలో పలు జట్లకు కోచ్‌గా సేవలందించిన అనుభవం స్టువార్ట్‌కు ఉంది. అతడి హయాంలోనే బంగ్లాదేశ్ అండర్ 19 జట్టు 2022లో ఆసియా కప్ ఫైనల్‌కు చేరుకుంది. అంతేకాదు ఆస్ట్రేలియా జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గానే కొన్నాళ్లు కొనసాగాడు స్టువార్ట్. నేపాల్ జట్టు విషయానికొస్తే.. 2023లో ఆసియా కప్ పోటీలకు తొలిసారి అర్హత సాధించింది. నిరుడు టీ20 వరల్డ్ కప్‌లోనూ ఆడింది. కానీ, మూడు మ్యాచుల్లో ఓటమితో నిరాశపరిచింది. వరల్డ్ కప్ లీగ్ 2లో భాగంగా ఈ ఏడాది జూన్‌లో స్కాంట్లాండ్, నెదర్లాండ్స్, నేపాల్ మధ్య ముక్కోణపు సిరీస్ జరుగనుంది. ఈ సిరీస్‌ను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న నేపాల్.. స్టువార్ట్ సలహాలు, సూచనలతో అదిరే ప్రదర్శన చేయాలనుకుంటుంది.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి**



**అబ్దుల్లాపూర్ మెట్,మహా :** మతసామరస్యాలకు ప్రతీక రంజాన్ పండుగ అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి సంబంధించి తుర్కయంజాల్ మున్సిపాలిటీ, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ముస్లిం సోదరులకు శనివారం సాయంత్రం పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో తారా కన్వెన్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందు అబ్దుల్లాపూర్ మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. మతసామరస్యాలకు ప్రతీక రంజాన్ పండుగ అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సోదరులందరూ కాంగ్రెస్ పార్టీ వెంటే ఉంటున్నారని తెలిపారు. అలాగే రాష్ట్రంలో, నియోజకవర్గంలో ఉన్న ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ కాశిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఇన్‌స్పెక్టర్ అంజిరెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ ఆర్‌ఐలు నిజాముద్దీన్, ఇంద్రాణి, కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సిద్దంకి కృష్ణారెడ్డి, పసుల రాజేందర్, కోట ప్రభాకర్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి తదితరులు పాల్గొన్నారు.

## ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆహ్వానించిన ముస్లిం మైనార్టీ నాయకులు



**మేళ్లచెరువు, మహా:** మేళ్లచెరువు మండలంలో రంజాన్ మాసం పురస్కరించుకొని ఆత్మీయ విందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులను మైనార్టీ అధ్యక్షులు నాగుల్ మీరా స్వయంగా కాంగ్రెస్ పార్టీ మండల నాయకులను కలిసి సాయంత్రం ఇఫ్తార్ విందుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీపార్టీ ముఖ్య నాయకులు మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, దేవాలయ చైర్మన్ శాగం రెడ్డి శంబి రెడ్డి, ఎక్స్ ఎంపీపీ కొట్టే పద్మశారేశ్వరరావు, ఎక్స్ జెడ్పిటిసి గోవిందరెడ్డి, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్ శెట్టి రామచంద్రయ్య, ఎక్స్ ఎంపిటీసీ శంభయ్య, నరసింహారెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు బండ్ల బిక్షం మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులను ఆహ్వానించినారు.

## నేడు సీఎం రేవంత్ రెడ్డి సభను జయప్రదం చేయండి

**కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు**

**మెల్లచెరువు,మహా:** మేళ్లచెరువు మండల కేంద్రంలో తెలంగాణ సీఎం రేపు హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో జరుగు భారీ బహిరంగ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు భారీగా తరలి వచ్చి జయప్రదం చేయాలని మండల నాయకులు అన్నారు. మేళ్లచెరువు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులను కార్యకర్తలను పెద్ద ఎత్తున పెద్ద ఎత్తున తరలించాలని వారికి బస్సు సౌకర్యాలు ప్రజలకు ఎటువంటి హాని జరగకుండా జాగ్రత్తగా వెళ్ళే విధంగా తగు జాగ్రత్తలు తీసుకునేలా మేళ్లచెరువు కాంగ్రెస్ పార్టీ నాయకులు రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య నాయకులు చర్చించుకున్నారు. ఇట్టి సమావేశంలో మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, దేవాలయ చైర్మన్, షాగం రెడ్డి శంబి రెడ్డి, ఎక్స్ జెడ్పిటిసి గోవిందరెడ్డి,ఎక్స్ ఎంపిటిసి శంభయ్య, ఓబీసీ చైర్మన్ శెట్టి రామచంద్రరావు, రామకృష్ణారెడ్డి, మల్లికార్జున్, గ్రామ శాఖ అధ్యక్షులు పండ్ల బిక్షం పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పోలీసు పటిష్ట బందోబస్తు

**బందోబస్తులో 1500 మంది పోలీసు సిబ్బంది**

**సభకు వచ్చే ప్రజలు, వాహనదారులు పోలీసు సూచనలు పాటించాలి**

**కె .నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి హుజుర్నగర్ పర్యటన సందర్భంగా సూర్యాపేట జిల్లా పోలీసు అన్ని రక్షణ ఏర్పాట్లు చేయడం జరిగినదని జిల్లా ఎస్పీ కె నరసింహ ఐపిఎస్ గ తెలిపినారు. హుజుర్నగర్ లో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను, మార్గాలు, సభా ప్రాంగణాన్ని, పార్కింగ్ ప్రదేశాలను, హెలిపాడ్ ప్రదేశాన్ని ఎస్పీ, పోలీసు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 1500 పోలీసు సిబ్బంది రక్షణ బందోబస్తు నిర్వహిస్తారనీ అన్నారు. అన్ని ఏర్పాటు పూర్తి చేశామని, జిల్లా యంత్రాంగం, ఇతర శాఖల సిబ్బందితో సమన్వయంగా పని చేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి సభకు వచ్చే వారి వాహనాల వల్ల ఎలాంటి ఇబ్బంది కలగకుండా, వాహనాలు ట్రాఫిక్ జామ్ అవకుండా చర్యలు తీసుకున్నాము. వాహనాల మళ్లింపు, వాహనాల పార్కింగ్ ప్రణాళిక చేశాం అన్నారు. సభాప్రాంగణానికి చేరుకునేలా అన్ని మార్గాల్లో వాహనాల పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమానికి వచ్చే వారు వారి యొక్క వాహనాలను ఆయా మార్గాల్లో ఏర్పాటుచేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి, మార్గం మధ్యలో పోలీసు వారి సూచనలు పాటించాలని అన్నారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, హుజూర్నగర్ సిఐ చరమంద రాజు, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, పోలీసు సిబ్బంది ఉన్నారు. పార్కింగ్ ప్రదేశాలకు చేరుకునేది ఇలా పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి వైపుగా వచ్చే బస్సులు, ట్రక్కులు హుజూర్నగర్ టౌన్ ఇందిరగాంధీ చౌరస్తా నుండి కుడివైపుగా వెళ్లి సాయిబాబా థియేటర్ నుండి వెళ్లి గ్రీన్‌హుడ్ స్కూలు వెనకాల నుండి పార్కింగ్ ప్రదేశానికి చేరుకోవాలి. పాలకీడు నేరేడుచర్ల గరిడేపల్లి నుండి వచ్చే కార్లు, ఆటోలు, ఇతర చిన్న వాహనాలు హుజూర్నగర్ టౌన్ ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద కుడివైపుగా వెళ్లి, శాంతిస్తూపం నుండి ఎడమ వైపుగా కేఎస్ఆర్ కాలని కామిశెట్టి రామయ్య నగర్ కాలనీ వద్ద ఏర్పాటు చేసిన ప్రదేశంలో పార్కింగ్ చేసుకోగలరు. మఠంపల్లి వైపుగా వచ్చే బస్సులు, ట్రక్కులు చౌటపల్లి, బక్కమంతుల గూడెం గ్రామాల మీదుగా వేపలసింగారం వైపు నుండి ఎడమ వైపు తిరిగి హుజూర్నగర్ బైపాస్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి వీపీఆర్ వెంచర్ వద్ద పార్కింగ్ చేసుకోగలరు. మఠంపల్లి వైపుగా వచ్చే కార్లు జీపులు ఆటోలు ఇతర చిన్న వాహనాలు వేపల సింగారం వైపు నుండి ఎడమవైపుకు తిరిగి హుజూర్నగర్ బైపాస్ మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి కుడివైపుకు తిరిగిన తర్వాత జి ఎస్ డి పిట్టల రవి వెంచర్ నందు పార్కింగ్ చేసుకోగలరు. చింతలపాలెం, మేళ్లచెరువు మండలాల వైపు నుండి వచ్చే బస్సులు, ట్రక్కులు వేపు సింగారం ఎఫ్ సి ఐ గోదాం మీదుగా హుజూర్నగర్ బైపాస్ లో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి కుడివైపుకు తిరిగి విపీఆర్ వెంచర్ కాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోగలరు. చింతలపాలెం, మేళ్లచెరువు వైపు నుండి వచ్చే కార్లు, జీపులు, ఆటోలు వేపుల సింగారం ఎఫ్సీఐ గోదాం మీదుగా హుజూర్నగర్ బైపాస్ లో గల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి ఎడమవైపుకు వచ్చిన తర్వాత జే ఎస్ డి మరియు పిట్టల రవి వెంచర్ కాళి ప్రదేశంలో వాహనాలు పార్కు చేసుకోగలరు. మోతే, నడిగూడెం, మునగాల, అనంతగిరి, కోదాడ పట్టణం మొదలగు ప్రాంతాల నుండి వచ్చే బస్సులు, ట్రక్కులు హుజూర్నగర్ ఎన్ఎస్పి కాలువ ఎడమవైపు బైపాస్ మీదుగా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ నుండి కుడివైపు వచ్చి విపీఆర్ వెంచర్ కాళీ ప్రదేశంలో పార్కింగ్ చేసుకోవచ్చు. మోతే, నడిగూడెం, మునగాల, చిలుకూరు, కోదాడ టౌన్ నుండి వచ్చే కార్లు జీపులు హుజూర్నగర్ ఎన్ఎస్పి కాలువ ఎడమవైపు మీదుగా ఎమ్మెల్యే కాంప్ ఆఫీస్ నుండి కుడివైపుగా వచ్చి జెఎస్ డి మరియు పిట్టల రవి వెంచర్ కాళీ ప్రదేశంలో వాహనాలు పార్కింగ్ చేసుకోగలరు.



# సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి

**మంత్రి ఉత్తమ్**

**మేళ్లచెరువు, మహా:** ఉగాది పర్వదినాన రేవంత్ రెడ్డి మహత్కరమైన కార్యాన్ని నేడు దేశంలో లేని విధంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం అది కూడా మన నియోజకవర్గము నుంచి అమలు కావడం నిజంగా మన అదృష్టంగా భావించాలి అని ఉత్తమ్ కుమార్ రెడ్డి తన మాటలో చెప్పుకోచ్చారు. అదేవిధంగా మొట్టమొదటిసారి తెలంగాణ రాష్ట్రంలో సన్న బియ్యం ప్రారంభించడం మన రాష్ట్రం ముందున్నట్టు ఏ రాష్ట్రంలో లేదని భారత దేశంలో మొట్టమొదటిసారి మన కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగటం విశేషంగా చెప్పుకొచ్చారు ఉగాది రోజు ప్రతి ఒక్కరు హుజూర్నగర్ రేవంత్ రెడ్డి మీటింగ్ కు అటెండ్ కావాలని పిలుపునిచ్చారు ప్రతి గ్రామంలోనూ మండలానికి సుమారు 20 నుంచి 30 బస్సులు పెట్టడం విశేషం ఆడవారికి ఆశ వర్కర్స్ కి ప్రత్యేకంగా గవర్నమెంట్ బస్సులు కేటాయించినట్టు అవేకాకుండా ప్రైవేట్ బస్సులు కూడా కేటాయించి ప్రైవేటు వెహికల్స్ ఏమున్న విలేజ్ కి వెయ్యి మంది తగ్గకుండా హాజరుకావాలని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి తెలియజేశారు. అదే విధంగా రైతులకు నీరు అందించే విషయంలో వడ్లు కొనుగోలు చేసే విషయంలో రైతుకు ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలియజేశారు. నేడు ప్రజలను చేరవేసే విషయంలో అన్ని విధాల తగు జాగ్రత్తలు వహించాలని ఉగాది పర్వదినాన ప్రతి ఒక్కరి కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని కాంగ్రెస్ పార్టీ ధ్యేయంగా ముందుకు పోతుందని ఈ విషయమై ప్రజలుకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ నిలబెట్టుకుంటుందని ఉత్తంకుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. రేవంత్ రెడ్డి బహిరంగ సభను ఒక ఛాలెంజ్గా తీసుకొని గ్రామాలలో ఒక్కరు కూడా ఉండకుండా ప్రతి ఒక్క రోజు నగర్లో ఉగాది పండుగ చేసుకోవాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## జిల్లాకు మంత్రి పదవి ఇచ్చి అభివృద్ధికి సహకరించాలి



జిల్లాకు మంత్రి పదవి ఇచ్చి ఉగాది శుభాకాంక్షలు తెలుపండి లేదంటే నిరాహార దీక్ష కైనా ఆమరణ దిశ కైనా సిద్ధం రాష్ట్ర కమ్యూనిటీ పారామెడికల్ అధ్యక్షులు ఉక్కుల అశోక్రం గారెడ్డి జిల్లా ప్రతినిధి మహా జిల్లాకు మంత్రి పదవి ఇచ్చి అభివృద్ధి కి సహకరించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు ఏనుముల రేవంత్ రెడ్డిని, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని, రాష్ట్ర పారామెడికల్ అధ్యక్షులు ఉక్కుల అశోక్ కోరడం జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలకు, నేతలకు ఉక్కుల అశోక్ సంకేతాలు అందించారు. ఇతర కొన్ని జిల్లాకు ఇద్దరు, ముగ్గురు మంత్రులు ఉన్నారు. కానీ రంగారెడ్డి జిల్లాకు ఒక మంత్రి కూడ అవసరం లేదా రంగారెడ్డి జిల్లా నుండి గెలిచినా ఒకే ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి. రంగారెడ్డి జిల్లాలో, రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి. ఉగాది పండుగకు తీపి కబురు వస్తుంది అని ఆశిస్తున్నాము. కార్యాచరణ సిద్ధం ఉక్కుల అశోక్ ఉగాది పండుగకు తీపి కబురు వస్తుంది అని ఆశిస్తున్నాము. లేకుంటే ఈ నెల 31న నిరాహార దీక్ష వాల్ పోస్టర్ రిలీజ్ చేస్తాం. ఏప్రిల్ 02 నుంచి నిరాహార దీక్షలు చేపడతాం. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ శేరిగూడ గ్రామంలోని గాంధీ విగ్రహం ముందు దీక్ష వచ్చేనెల 2న బుధవారం ఉదయం 10 గంటల నుండి మొదలుపెడతాం. మల్ రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుంటే ఆమరణ దీక్షకైనా సిద్ధంగా ఉన్నాం. తెలంగాణ కమ్యూనిటీ పారామెడిక్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి ఉక్కుల అశోక్ మాట్లాడుతూ... రాష్ట్రములో కాంగ్రెస్ పార్టీ అధికారములోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా రంగారెడ్డి జిల్లాకు మంత్రివర్యులు లెరని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, జిల్లా ప్రజలందరూ తీవ్ర నిరుత్సాహములో ఉన్నారన్నారు.

## బ్రాంజ్ మెడల్ సాధించిన కావేరి జ్యోతి అభినందించిన జిల్లా కలెక్టర్



**కాటారం , మహా డైలీ :** ఫస్ట్ ఏసియన్ పేరా ఒలంపిక్ త్రో బాల్ పోటీలో భారతదేశానికి బ్రాంజ్ మెడల్ సాధించిన కావేరి జ్యోతిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం అభినందించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మారుమూల పలిమెల మండల కేంద్రానికి చెందిన కావేరి జ్యోతి నిరుపేద దళిత వికలాంగురాలుని, జ్యోతి పారా ఒలంపిక్ త్రో బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో ప్రభుత్వం తరపున సహకారాలు అందించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారని తెలిపారు. జ్యోతికి కాంబోడియా దేశానికి వెళ్లడానికి ప్రయాణ వసతి శిక్షణ ఖర్చులన్నీ కూడా ప్రభుత్వం ద్వారా ఇప్పించడం జరిగిందని ఆయన తెలిపారు. పారా ఒలింపిక్ త్రోబాల్ క్రీడలో తన అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించిన కావేరి జ్యోతి, తన విజయం ద్వారా రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలిచారని, తద్వారా మన జిల్లా కీర్తిని విశ్వవ్యాప్తం చేశారని జిల్లా కలెక్టర్ అభినందించారు.

## సాహెబ్ గూడ దగ్గర ఫిరంగినాలపై ప్రమాదం



**వరంగల్ జిల్లా ప్రతినిధి మహా:** ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళపల్లి నుండి కొంగర కలాన్ వెళ్లే రహదారిలో, సాహెబ్ గూడ దగ్గర ఫిరంగినాలపై పూర్వం ఏర్పాటు చేసిన వంతెన శిథిలావస్థకు చేరింది. గతంలో సింగల్ లైన్ గా ఉన్న రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా వేశారు. ఈ యొక్క నాలపై కొత్తగా వంతెనను నిర్మించాల్సి ఉండగా నిర్మించకుండా అంతలోనే వదిలేశారు. ఈ మార్గంలో తరచూ భారీ భర్తీ లోడుతో వాహనాలు రావడంతో, నాలాపై వంతెన వెడల్పు సింగల్ లైన్ గా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భర్తీ లారీ, ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి వంతెన పైన ఉన్న గోడను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. ప్రాణం నష్టం ఏమి జరగలేదు. ఫిరంగినాలపై నిర్మించిన వంతెన వెడల్పు తక్కువగా ఉండడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు తెలిపారు. ఈ యొక్క వంతెనను తొలగించి ఆర్ అండ్ బి, మున్సిపాలిటీ అధికారులు నూతనంగా వంతెనను నిర్మించాలని అన్నారు. మరో ప్రమాదం చోటు చేసుకుంది... శ్రీ ఇందు ఇంజనీరింగ్ కాలేజ్ నుండి మంగళపల్లి మార్గం మధ్యలో, నాగార్జున సాగర్ రహదారిపై డివైడర్ను ఢీ కొట్టిన స్విఫ్ట్ కారు. బడంగ్పేట్ మున్సిపాలిటీ గుర్రంగూడకు చెందిన నర్సింహారెడ్డి, స్వగ్రామం సిరసనగండ్లకు పోయి తిరుగు ప్రయాణంగా, గుర్రంగూడ వెళ్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో కారులోని ఎయిర్ బెలూన్స్ ఓపెన్ కావడంతో వ్యక్తికి ఎలాంటి ప్రమాదం జరగకుండా బయటపడ్డాడు. మధ్యాహ్న సమయంలో ప్రయాణం చేయడంతో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో హైబత్ కావడంతో ప్రమాదం జరిగిందని నరసింహారెడ్డి తెలిపారు.

## దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ

**మంత్రి ధనసరి అనసూయ సీతక్క**



**ములుగు, మహా :** దివ్యాంగుల ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శనివారం ఏటూరునాగారం మండల కేంద్రం లోని గిరిజన భవన్ లో జిల్లా సంక్షేమ అధికారిణి కూచన శిరీష అధ్యక్షతన దివ్యాంగులకు వివిధ రకాల సహాయ ఉపకరణాలు అందించే కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ దివ్యాంగులలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకే ఈ సహాయ ఉపకరణాల పంపిణీ చేయడం జరుగుతుందని, వారిని ఆత్మగౌరవంతో జీవించేలా చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రథమ లక్ష్యం అని, అందులో భాగంగానే మన ములుగు జిల్లాలోని దివ్యాంగులకు గతం లో 4 చోట్ల ప్రత్యేకమైన శిబిరాలను నిర్వహించి దరఖాస్తులను స్వీకరించి అందులో నుండి అర్హులను ఎంపిక చేయడం జరిగిందని, ఈ అర్హులైన దివ్యాంగులకు అలింకో సంస్థ సహకారంతో సహాయ ఉపకరణాలను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ సహాయ ఉపకరణాలను తీసుకున్న లబ్ధిదారులు పునరుత్తేజంతో తమ జీవితాన్ని కొనసాగిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం అనేది ఏదో ఒక్క అవయవానికి మాత్రమే ఉంటుంది. కాబట్టి వైకల్యం ఉన్న అవయవాన్ని గురించి వేదనకు గురికాకుండా ఆరోగ్యంగా ఉన్న మిగతా అవయవాల తో ధైర్యంగా ముందుకు వెళ్ళే ప్రయత్నం చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అందులో భాగంగానే వారికి ప్రభుత్వ/ప్రైవేట్ ఉద్యోగ అవకాశాల కోసం ప్రత్యేకంగా ఒక వెబ్ సైట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, వారికి వివిధ రకాలుగా ప్రోత్సాహకాలు, అందించడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం వంటి వివిధ సంక్షేమ పథకాల్లో 5% రిజర్వేషన్ అలాగే ఉద్యోగాల్లో 4% రిజర్వేషన్ అందించే దిశగా ప్రభుత్వం అడుగేయడం జరిగిందని అన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాముల రాంరెడ్డికి సన్మానం



**హుజూర్ నగర్, మహా:** హుజూర్నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన సామల రామ్ రెడ్డికి శనివారం హుజూర్నగర్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ హుజూర్నగర్ అసోసియేషన్ చరిత్రలో అత్యధికంగా అధ్యక్షుడిగా పనిచేసి ప్రజల ఆదరభిమానులు పొందుతున్న రాంరెడ్డి మునుముందు మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని, అత్యధిక సార్లు అధ్యక్షుడిగా పని చేస్తూనే తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా ఎన్నికై భక్తులకు స్వామివారి దర్శనాన్ని ఇప్పించారని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్, టి పి సి సి అధికార ప్రతినిధి అల్లం ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఈడ్పుగంటి సుబ్బారావు, టిపిసిసి సభ్యులు దొంగరి వెంకటేశ్వర్లు, కె నాగేశ్వరరావు, పారుపల్లి చంద్రశేఖర్, పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి



**ముఫ్తి మొహమ్మద్ గౌసుద్దీన్**

**హుజూర్ నగర్, మహా:** సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గ కేంద్రంలో అఖిలభారత ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు ముస్లిం మైనార్టీలు ఉపవాస దీక్షలలో తీవ్ర ఎండలలో కుడి చేతికి నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుత నిరసన భారీ ర్యాలీ ఉస్మానియా మస్జిద్ నుండి ఇందిరాచౌ వరకు ఇందిరా చౌక్ నుండి ఉస్మానియా మస్జిద్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉస్మానియా మస్జిద్ ముఫ్తి మహమ్మద్ గౌస్ ఉద్దీన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024లో తెచ్చిన వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలోని మేధావులు అన్ని రాజకీయ పార్టీలు వక్ఫ్ బిల్లును వ్యతిరేకించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి శాసనసభలో వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజూర్నగర్ పట్టణంలోని అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ముస్లిం మైనార్టీ నాయకులు మరియు ముస్లిం పెద్దలు ముస్లిం యువకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.